శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
PRAJAPAKSHAM ★
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

విలక్షణ సాహిత్యం.. కాఫ్కాకే సొంతం

4లో

సోమవారం | 13-05-2024 | హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 323 | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

## స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచల భద్రత

**జూన్ 4 వరకు 144 సెక్షన్**

**సివిల్, టిఎస్ఎస్‌పి, సిఆర్‌పిఎఫ్ బలగాల మొహరింపు**

**24 గంటలు నిఘా : సిసి కెమెరాలతో పర్యవేక్షణ**



ప్రజాపక్షం/హైదరాబాద్

ఇవిఎం మిషన్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచల భద్రతను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు జరిపే జూన్ 4వ తేదీ వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ విధించారు. సోమవారం జరిగే లోకసభ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే రాత్రి వరకు ఇవిఎం మిషన్లను స్ట్రాంగ్ రూమ్‌ల్లోకి అత్యంత పోలీసు బందోబస్తు మధ్య తరలించనున్నారు. ఇవి ఎంను భద్రపరిచేందుకు ఆయా జిల్లాలో స్ట్రాంగ్ రూమ్‌లను ఎంపిక చేశారు. ఈ కేంద్రాల వద్ద సిసి కెమరాలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో పాటు 24 గంటలు విద్యుత్ ఉండే విధంగా జనరేటర్లను వినియోగిస్తున్నారు. మూడంచల భద్రతలో స్ట్రాంగ్ రూమ్ మొదటి అంచున కేంద్ర పారామిలటరీ బలగాలు, రెండో వరుస లో రాష్ట్ర ఆర్మడ్ రిజర్వ్ పోలీసులు, మూడో వరుసలో సివిల్ పోలీసులు బందోబస్తుగా ఉంటారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ బందోబస్తును ఆయా పోలీసు కంట్రోల్ రూమ్‌లలో సిసిటివిల ద్వారా ఉన్నతాధికారులు వీక్షించే వీలు కల్పించారు. రాష్ట్రంలోని అన్ని స్ట్రాంగ్ రూమ్‌లను డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కం ట్రోల్ రూమ్‌లో సిసిటివి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. అభ్యర్థు లు ఎవరైనా స్ట్రాంగ్ రూమ్‌ను తరువాయి 2లో

# రాష్ట్రంలో సర్వం సిద్ధం

**17 స్థానాలు...525 మంది అభ్యర్థులు పోటీ**

**3,32,32,318 మంది ఓటర్లు**

**87 వేల ఇవిఎం : 12 వేల పోలింగ్ కేంద్రాలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం జరగనున్న పోలింగ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌ సభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతుండగా, 525 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత నిమిత్తం 73 వేల మంది మంది పోలీసు బలగాలను మొహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,32,32,318 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,65,13,014 మంది పురుషులు, 1,67,00,574 మంది మహిళలు, ఇతరులు 2760 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హైదరాబాద్ నగరంలో తొలిసారి 15 డ్రోన్‌ల సహాయంతో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. దీనిని జిహెచ్ ఎంసి ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఉదయం 7 గంటల తరువాయి 2లో





లోక్‌సభ ఎన్నికలు

# 4వ విడత పోరు నేడే

**10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికలు**

**తెలంగాణలో 17, ఆంధ్రప్రదేశ్‌లో 25 సీట్లు**

**బరిలో మొత్తం 1,717 మంది అభ్యర్థులు**

**1.92 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**

**17.70 కోట్ల మంది ఓటర్లు**

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నేడు నాల్గొవ దశ పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ విడతలో పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగను న్నాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 175 స్థానాలకు, తెలంగాణలోని కం టోన్మెంట్ శాసనసభ నియోజకవర్గంలో ఉప ఎన్నిక, ఒడిశా అసెంబ్లీకి తొలి విడత కింద 28 సీట్లకు ఎన్నికలు సోమవారం జరగను న్నాయి. కాగా, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు, ఆంధ్రప్రదేశ్‌లో 25, ఉత్తరప్రదేశ్‌లో 13, బీహార్‌లో 5, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదే శ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, పశ్చి మ బెంగాల్‌లో 8, జమ్ముకశ్మీర్‌లో ఒక సీటు లో పోలింగ్ జరగనుంది. జమ్ముకశ్మీర్‌లో ఆర్టి కల్ 370 రద్దు తరువాత జరుగుతున్న పెద్ద ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. ప్రతిష్టా త్మక శ్రీనగర్ లోక్‌సభ స్థానంలో మొత్తం 24 మంది పోటీలో ఉండగా, 17.48 లక్షల మంది పోలింగ్‌లో పాల్గొనున్నారు. అదే విధంగా మొత్తం 96 లోక్‌సభ స్థానాల్లో 1,717 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, 19 లక్షలకుపైగా పోలింగ్ అధికారులను ఎన్నికల కమిషన్ విధుల్లో మోహరింపచే సింది. 1.92 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 17.70 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో 8.73 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పశ్చిమ బెంగాల్‌లో 8 పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 3,647 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమై నవిగా ఇసి గుర్తించింది. ఇక్కడ 152 పారా మిలిటరీ కంపెనీలను మోహరింపజేసింది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతుండగా, ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానా లకు పోలింగ్ జరిగింది. నేడు నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. ఇంకా మూడు దశలు మే 20, మే 25, జూన్ 1వ తేదీన తరువాయి 2లో



## ఏజెన్సీలో హై అలెర్ట్

**వరుస ఎన్ కౌంటర్లతో అప్రమత్తం**
**ముమ్మర తనిఖీలు, ప్రత్యేక నిఘా**

ప్రజాపక్షం/భద్రాచలం

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా భద్రాచలం ఏజెన్సీలో హై అలెర్ట్ కొనసాగుతోంది. గడిచిన రెండు మాసాలుగా సమీప ఛత్తీ స్‌గఢ్ అడవుల్లో పెద్దఎత్తున తరువాయి 2లో



## గాలి, వాన ఉరుములు, మెరుపులు

**ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పిడుగు పాటుకు ముగ్గురు మృతి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం

మరో ఐదు రోజులు మోస్తరు వర్షాలు : వాతావరణశాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పిడుగు పాటుకు ముగ్గురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలో పిడుగు పడి తాతమనవడు మృతి చెందడంపై సిఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. పిడుగు పాటుతో గాయపడిన ఐదుగురికి వైద్య సాయం అందించాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పిడుగుపడి తాతా మనవళ్లు మృతి చెందిన విషాదకర సంఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని రామోజీపల్లిలో చోటుచేసుకుంది. వర్షం కురుస్తుండటంతో స్థానిక ఐకెపి సెంటర్‌లో ఆర బోసిన ధాన్యం తడుస్తోందని పల్వంచ శ్రీరాములు (51), అతని మనుమడు విశాల్ (11) వడ్ల కుప్పల మీద టార్పాలిన్లు కప్పడానికి వెళ్లారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులు వచ్చి, పిడుగు పడే పరిస్థితి కనిపించింది. చెట్టు కిందకు వెళితే పిడుగు పడుతుందనే భయంతో వర్షం పడుతున్నా ఖాళీ సంచులు తలపై కప్పి వడ్ల కుప్ప దగ్గరే ఉన్నారు. అయితే వారికి సమీపంలోనే పిడుగు పడటంతో శ్రీరాములు, విశాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనూహ్యంగా పిడుగుపడి తాతా మనవళ్లిద్దరూ మృతి చెందడంతో రామోజీపల్లి లో విషాధ ఛాయలు అలుముకున్నాయి. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలం గిమ్మ గ్రామ శివారులో పిడుగుపాటుకు అయిదుగురు వ్యక్తులు గాయాలపాలవ్వటం కలకలం సృష్టించింది. వీరిలో గిమ్మ గ్రామానికే చెందిన మామిడిపల్లి కిరణ్ అనే వ్యక్తి మృతి చెందటం స్థానికంగా విషాదం నింపింది. ఎంపిటిసి సభ్యుడు కోల భోజన్న, మాజీ ఎంపిటిసి సభ్యుడు రమేష్, ఉప సర్పంచ్ భర్త తరువాయి 2లో

## తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

**భారీ వర్షాల సూచనలతో అప్రమత్తంగా ఉండండి**

**అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతుల తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుండడంపై సిఎం స్పందిస్తూ ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి పోతే రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు తరువాయి 2లో



## ముఖ్యమంత్రి ఆటవిడుపు

**హెచ్‌సియులో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన రేవంత్‌రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రచారం ముగిసే వరకు క్షణం తీరక లేకుండా బిజీబిజీగా గడిపిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం కాస్త సేద తీరారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సియు)లో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. విద్యార్థులకు ఏ మాత్రం తగ్గకుండా రేవంత్‌రెడ్డి పరుగులు తీస్తూ పోటీపడి మరి ప్రొఫెషనల్ క్రీడాకారుల మాదిరిగా మ్యాచ్‌లో తరువాయి 2లో

## చైనా ఆధీనంలోని భూభాగం వెనక్కి

24 గంటల విద్యుత్తు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, 'అగ్నివీర్' రద్దు

'కేజ్రీవాల్ కి గ్యారంటీ' ప్రకటించిన ఢిల్లీ సిఎం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ 'కేజ్రీవాల్ కి గ్యారంటీ' ప్రకటించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చైనా ఆక్రమించుకున్న భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో సహా యుద్ధప్రాతిపదికన చేసే పది పనులను చేస్తామని హామీనిచ్చారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టు అయి తీహార్ జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం నాడు విడుదల విషయం తెలిసిందే. శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్ కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ఆప్ అందులో భాగస్వామిగా ఉంటుందని పేర్కొన్న విషయం విదితమే. కాగా, ఆదివారం తరువాయి 2లో







జమిలీ ఎన్నికలు సమాఖ్య వాదానికి ప్రమాదం

దేశంలో బిజెపి వ్యతిరేక పవనాలు

కాలుష్య సమస్య ప్రస్తావన ఏది?

## పాత్రధారులు సరే... సూత్రధారుల మాటేమిటి?

**దభోల్కర్ హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు, ముగ్గురికి విముక్తి**



**పుణే (మహారాష్ట్ర):** మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన్ సమితి (మూఢ నమ్మకాల నిర్మూలన కమిటీ, మహారాష్ట్ర)లో కీలక పాత్ర పోషించిన ప్రముఖ సామాజిక కార్యకర్త, హేతువాది నరేంద్ర దబోల్కర్ (69) హత్య కేసులో పాత్రధారులకు మాత్రమే శిక్షపడింది. సూత్రధారులు ఎవరో దర్యాప్తు సంస్థలు తేల్చలేకపోవడం, కోర్టుకు సరైన సాక్ష్యాధారాలు ఇవ్వలేకపోవడం విచిత్రం. 2013, ఆగస్టు 20న దభోల్కర్ హత్యకు గురికాగా, పదేళ్ల తర్వాత పుణే కోర్టు ఈ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధించింది. ముగ్గురిని నిర్దోషులుగా ప్రకటించింది. నేరం వెనుక సూత్రధారులను వెలికితీయడంలో అధికారులు విఫలమయ్యారని కోర్టు విమర్శించింది. ఈ కేసులో సిబిఐ వ్యవహరించిన తీరుపట్ల ప్రత్యేక న్యాయమూర్తి ప్రభాకర్ పి. జాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పూణే పోలీసులు కూడా సూత్రధారులు ఎవరో గుర్తించలేకపోవడాన్ని ప్రస్తావించారు. సామాన్యులకు కూడా సిబిఐ, పుణే పోలీసుల వైఖరి పట్ల అనుమానాలు తలెత్తడంలో తప్పులేదు. ఇది నిఘా విభాగం, పోలీసుల వైఫల్యమా లేక అధికారంలో ఉన్న వ్యక్తుల ఒత్తిడే కారణమా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ కేసులో రెండో నిందితుడు సచిన్ ప్రకాశరావు అందురే (33), మూడో నిందితుడు శరద్ భౌ సాహెబ్ కలస్కర్ (28)ను దోషులుగా నిర్ధారించారు. వారికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, భారతీయ శిక్షాస్మృతి, ఆయుధాల చట్టంలోని సెక్షన్ 3 (25) ప్రకారం ఉమ్మడి ఉద్దేశ్యంతో ఇద్దరిని దోషులుగా నిర్ధారించిన న్యాయమూర్తి, ఒక్కొక్కరికి రూ.5 లక్షల జరిమానా విధించారు. మిగిలిన ముగ్గురు అండర్ ట్రయల్స్ విషయానికొస్తే ప్రధాన నిందితుడు, ఇఎన్‌టి సర్జన్ వీరేంద్రసింగ్ శరద్చంద్ర తావ్డేను సిబిఐ సూత్రధారిగా పేర్కొంది. నాలుగో నంబర్ ముద్దాయి, న్యాయవాది సంజీవ్ గజానన్ పునాలేకర్, ఐదో నంబర్ నిందితుడు విక్రమ్ వినయ భావే ఈ హత్య కేసులో షూటర్లకు సాయం చేశారని ఆరోపించింది. అయితే, వారిద్దరికీ వ్యతిరేకంగా ఎలాంటి తరువాయి 8లో

## మైనారిటీలు ఎటువైపు?

సర్వత్రా ఆసక్తి

చివరి సమయంలో మారిన సమీకరణలు

ప్రజాపక్షం/హైదరాబాద్

మరి కొన్ని గంటల్లో ప్రారంభంకానున్న లోక్‌సభ పోలింగ్‌లో మైనార్టీల ఓట్లు ఎటువైపు అనేది చర్చనీయంశంగా మారింది. ఈ ఎన్నికల్లో కూడా తమ వైపే మైనార్టీలు మొగ్గుచూపుతారని బిఆర్ఎస్ ఎంతో ఆశలు పెట్టుకున్నది. కానీ చివరి సమయంలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసి ఇవి ''మాము'' ఎన్నికలు కావని, ఈ సారి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పరోక్షంగా సంకేతాలిచ్చారు. దీంతో బిఆర్ఎస్‌కు ఊహించని షాక్ తగిలిందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికలు, ముఖ్యంగా గత శాసనసభ, ఆ తర్వాత జరిగిన



లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు మజ్లీస్ పూర్తి మద్దతుగా నిలిచించింది. తాజా రాజకీయ పరిణామాలు, లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతు ప్రకటించలేదు. దీంతో ఇక మైనార్టీలు ఎటు వైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తి నెలకొన్నది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మైనార్టీలు ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. మైనార్టీ ఓట్లు చీలిపోతే తమకు ఉపయోగమని బిజెపి భావిస్తోంది. బిఆర్ఎస్, తరువాయి 8లో

## ఎండుతున్న అడవి



అడవుల్లో కొన్ని చెట్లు ఎండిపోతుంటే, మరికొన్ని చెట్లు పెరుగుతూ ఉంటాయి. ఇది సహజం. కానీ, పర్యావరణ మార్పులు, మితిమీరిన కాలుష్యం కారణంగా ఏకంగా అడవులే ఎండిపోతున్న పరిస్థితులు దాపురించాయి. ఆస్ట్రేలియాలోని టాస్మానియాలో నెలకొన్న దుస్థితి, భవిష్యత్ తరాల భద్రత, పర్యావరణ సమస్యలపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. హోబర్ట్ సమీపంలోని చెట్లు ఎండిపోతుండగా, టాస్మానియాలోని భారీ అటవీ ప్రాంతంలోని అత్యధిక శాతం చెట్ల పచ్చదం కోల్పోయి, గోధుమ రంగుకు చేరుకున్నాయి. లెక్కకు మించిన చెట్లు నిలువుగా ఎండిపోతున్నాయి. వాతావరణం నిరంతరం వేడెక్కుతున్నందున భవిష్యత్తులో అడవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని శాస్త్రవేత్తలు చేస్తున్న హెచ్చరికలను ప్రపంచ



దేశాలు పట్టించుకుంటున్న జాడలు కనిపించడం లేదు. అన్ని రుతువుల్లోనూ, గ్రీష్మం మాత్రమే ఎక్కువ రోజులు కొనసాగడం, ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం ఈ వైపరీత్యానికి ప్రధాన కారణాలు. మనిషి తన నాశనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నాడనడానికి టాస్మానియా అడవీ ప్రాంతమే నిదర్శనం. ఫంగస్ లేదా ఇతర చీడల వల్ల కూడా చెట్లు ఎండిపోవడం, చనిపోవడం జరుగుతుంది. అయితే, టాస్మానియాలో మాత్రం అధిక ఉష్ణోగ్రతలు, వాయు కాలుష్యమే కారణమవుతున్నాయి. అయితే, సమస్య స్థాయిని అంచనా వేయడానికి ఇంకా సర్వేలు జరగకపోవడం శోచనీయం.

# ఉత్తర గాజాలో పోరు ఉధృతం





ప్రపంచం

ఇజ్రాయెల్, హమాస్ దళాల మధ్య గాజా స్ట్రిప్ ఉత్తర భాగంలో పోరు ఆదివారం ఉధృత రూపం దాల్చింది. దాదాపుగా ఈ ప్రాంతం మొత్తాన్ని ఆధీనంలోకి తెచ్చుకున్నామని ఇజ్రాయెల్ మిలటరీ అధికారులు వెల్లడించారు. అయితే, భద్రతా వెసులుబాటును ఉపయోగించుకొని హమాస్ అగ్రనాయకత్వం గుర్తుతెలియని ప్రాంతాలకు తరలివెళ్లినట్టు చెప్పారు. కాగా, ఇజ్రాయెల్ దక్షిణ గాజా నగరమైన రఫా దాడులు, కాల్పులతో దద్దరిల్లిపోతున్నది. ఈ ప్రాంతాన్ని హమాస్‌కు చివరి రక్షణ కోటగా ఇజ్రాయెల్ పేరొంటున్నది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా సుమారు మూడు లక్షల మంది పౌరులు రఫా నుంచి ఇతర ప్రాంతాలకు పారిపోయారు. పౌరులకు ఎలాంటి హాని జరిగినా చూస్తూ ఊరుకునేది లేదని ఈజిప్టు చేసిన హెచ్చరికలను ఇజ్రాయెల్ పెడచెవిన పట్టడం ఆందోళన కలిగిస్తున్నది. గాజా లోయుద్ధానంతర పాలన కోసం ఇజ్రాయెల్ ఇంకా వివరణాత్మక ప్రణాళికను సిద్ధం చేసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పాలస్తీనాను ప్రపంచ పటంలో కనిపించకుండా చేస్తామని ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజిమిన్ నేతన్యాహు గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. హమాస్ ఉగ్రవాదుల పేరుతో గాజా స్ట్రిప్ మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇలావుంటే,ఉత్తర గాజా స్ట్రిప్‌లోని జబాలియా పట్టణంలోని శరణార్థి శిబిరంతో పాటు, సమీపంలోని జనావాసాలపైన కూడా ఇజ్రాయెల్ బాంబదాడులుచేసిందని పాలస్తీనా వర్గాలు పేర్కొన్నాయి. దాడుల్లో భారీ విధ్వంసం చోటు చేసుకుందని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ప్రకటించింది. రఫా పౌరులను ఉత్తర ప్రాంతాలకు వెళ్లిపోవాలనిప్రకటించిన ఇజ్రాయెల్, తాజాగా అక్కడ కూడా దా డులు చేయడాన్ని అంతర్జాతీయ సామాజం ఖండిస్తున్నది. ఈజిప్టు, టర్కీ, సిరియా, ఇరాన్, ఇరాక్ వంటి దేశాలు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా స మస్యలు పరిష్కరించుకోవాలని ఇజ్రాయెల్‌కు సూచించాయి. సిరియాహౌతీతిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై దాడులుకూడా చేశారు. అయినప్పటికీ, గాజా స్ట్రిప్‌పైన, పాలస్తీనా ప్రజలపైనా ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగిస్తునే ఉంది. ఈ ప్రాంతంలో కనీసం 450,000 మంది ప్రజలుకనీససౌకర్యాలులేక,కరువుతో అల్లాడుతున్నారు. సరైన వైద్య సేవలు లేకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అంతర్జాతీయ యుద్ధ నియమాలను అనుసరించకుండా,మానవతాదృష్టిని ప్రదర్శించకుండా పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల పట్ల ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు పెరుగుతున్నాయి.

## భారత్‌కు అగ్ర వాణిజ్య భాగస్వామిగా చైనా



నిన్న మొన్నటి వరకూ భారత్‌కు అగ్ర వాణిజ్య భాగస్వామిగా ఉన్న అమెరికాను రెండో స్థానానికి నెట్టేసిన చైనా, అగ్రస్థానాన్ని ఆక్రమించింది. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎకనామిక్ థింక్ ట్యాంక్‌గా పేర్కొనే గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జిటిఆర్ఐ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, చైనా మొత్తం 118.4 బిలియన్ల యుఎస్ డాలర్ల మేర టర్నోవర్‌తో భారత అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికాను అధిగమించింది. చైనా కు భారత్ ఎగుమతులు 8.7శాతం పెరిగి16.67బిలియన్‌డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 3.24 శాతం పెరిగి 101.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీనికి విరుద్ధంగా, అమెరికాకు ఎగుమతులు కొద్దిగా తగ్గి 77.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దిగుమతులు దాదాపు 20 శాతం తగ్గి 40.8 బిలియన్ డాలర్లకు తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరంలో118.4 బిలియన్ డాలర్ల ఇరువైపు వాణిజ్య లావాదేవీల్లో చైనా ఎంతో పురోగతిని నమో దు చేసింది. చైనాకు భారత్ ఎగుమతులు 8.7 శాతం పెరిగి 16.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.ఆ దేశానికిఎగుమతుల్లో ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేసిన ప్రధాన రంగాలలో ఇనుప ఖనిజం, పత్తి నూలు, దుస్తులు, చేనేత, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలు, ప్లాస్టిక్, లినోలియం ఉన్నాయి. పొరుగు దేశం నుంచి దిగుమతులు 3.24 శాతం పెరిగి 101.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా, 2022–23లో 78.54 బిలియన్ డాలర్ల నుంచి 2023–24లో అమెరికాకు ఎగుమతులు 1.32 శాతం తగ్గి 77.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. దిగుమతులు దాదాపు 20 శాతం తగ్గి 40.8 బిలియన్ డాలర్లకు చేరాయి. కాగా, చైనా ఎగుమతులు 0.6 శాతం తగ్గి 16.75 బిలియన్ డాలర్ల నుంచి 16.66 బిలియన్ డాలర్లకు చేరుకోగా, చైనా నుంచి దిగుమతులు 44.7 శాతంపెరిగి 70.32 బిలియన్ డాలర్ల నుంచి 101.75 బిలియన్ డాలర్లగా ఉన్నాయి. దిగుమతులలో ఈ పెరుగుదల విస్తరిస్తున్న వాణిజ్య లోటుకు దారితీసింది, ఇలావుంటే, వాణిజ్య మం త్రిత్వ శాఖ డేటా ప్రకారం, 2013–14 నుండి 2017–18 వరకు, తిరిగి 2020–21 లో కూడా చైనా భారతదేశపు అగ్ర వాణిజ్య భాగస్వామి. చైనా కంటే ముందు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) దేశం యొక్క అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2021–22 మరియు 2022–23లో ఆ స్థానం అమెరికాది.

## నిర్లక్ష్యంఖరీదు



నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఏకంగా పౌరసత్వమే కోల్పోయాడు గ్లెన్ కియోగ్. ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నివాసి కియోన్ సుమారు33 సంవత్సరాల క్రితమే, అంటే,1991లోనేపౌరసత్వం కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆసీస్ ఆంతరంగికవ్యవహారాల శాఖ ఇటీవల ఇ–మెయిల్ ద్వారా సమాచారం అందించింది. ఆస్ట్రేలియాలో పుట్టిపెరిగిన తాను, తన మాతృ దేశంలో పౌరసత్వం ఎందుకు కోల్పోయానన్నది కియోన్‌కు చాలా ఆలస్యంగా గుర్తుకొచ్చింది. ఐరిష్ పౌరసత్వం కోసం అతను దరఖాస్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియాలో ఉంటూ, మరో దేశ పౌరసత్వాన్ని కోరుకోవడం అప్పటి నిబంధనలను అనుసరించి చెల్లదు. 2002లో ఈ చట్టాన్ని మార్చారు. మరో దేశ పౌరసత్వం తీసుకున్న తర్వాతే ఆస్ట్రేలియా పౌరసత్వం రద్దవుతుందని సవరణ చేశారు. కానీ, 1991లో కియోగ్ దరఖాస్తు చేసుకున్నప్పుడు, పాత చట్టమే అమల్లో ఉండేది. ఫలితంగా అతను అప్పుడే తన పౌరసత్వాన్ని కోల్పోయాడు. కానీ, ఆ విషయం తెలియకుండానే సంవత్సరాలుగడిపేశాడు.ఒక రకంగా చెప్పాలంటే,ఐరిష్‌పౌరసత్వంకోసందరఖాస్తు చేసుకున్న విషయాన్నేమరచిపోయాడు.కానీ,ఆస్ట్రేలియా ప్రభుత్వం పౌరసత్వం రద్దయిందంటూ బాంబుపేల్చింది.తాను ఆస్ట్రేలియాపౌరుడ్నికానని తెలియడంతో ఉలిక్కిపడ్డాడు. సాంకేతికంగా చెప్పాలంటే, అతను ఆస్ట్రేలియా రికార్డుల ప్రకారంలేదు. భార్య డానా డెనెహే, పిల్లలతో కలిసి ఎక్కడికి వెళ్లాలోతెలియకఅల్లాడుతున్నాడు. కియోగ్ తాతముత్తాతలు ఐర్లాండ్‌కు చెందిన వారు. అక్కడి నుంచి ఆస్ట్రేలియాకు వలస వచ్చారు. కొన్ని తరాలుగా కియోగ్ కుటుంబం అక్కడే ఉంటున్నది. తన పూర్వీకులకు చెందిన ఐర్లాండ్‌కే వెళ్లి ఉండిపోవాలన్న ఆలోచనతో, అప్పట్లో అతను అక్కడి పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పుడు చిక్కుల్లో పడ్డాడు. ఐరిష్ పౌరసత్వం రాలేదు. ఆస్ట్రేలియా పౌరసత్వం పోయింది. రెంటికీ చెడిన రేవడైంది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటనేది కియోగ్‌కు మాత్రమే కాదు.. ఆస్ట్రేలియా ప్రభుత్వానికి కూడా ప్రశ్నే!

## కొనుగోలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సిఎం విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని సిఎం చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు.

## ఏజెన్సీలో హై అలెర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోవడం, మావోయిస్టు పార్టీకి భారీ నష్టం వాటిల్లడం, సుమారు వంద మందికి పైగా మావోయిస్టులు మృతి చెందడంతో ఏజెన్సీలో పోలీసుల నిఘా పెద్ద ఎత్తున నడుస్తోంది. తెలంగాణతో పాటు సమీపంలోని ఏపి, ఛత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల్లో సైతం ఎన్నికలు ఉండటం, మావోయిస్టులు చెదురు మదురు ఘటనలకు పాల్పడే అవకాశం ఉందేనే ఇంటిలిజెన్సీ నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసులు అంతరాష్ట్ర రహదారులను తమ ఆధీనంలోనికి తీసుకున్నారు. అటవీ ప్రాంతాలపై నిఘా పెంచారు. గోదావరి ఫెర్రీ పాయింట్లపై కన్నేశారు. ఈ పార్లమెంట్ పరిధిలో 137 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండటంతో అధికారులు అటుగా దృష్టి సారించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్సు నిర్వహిస్తున్నారు.

**ముమ్మర తనిఖీలు**

ఎన్నికల సందర్భంగా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. వచ్చే పోయి వాహనాలను ఆపి సోదాలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలతో పాటు వారికి అనుకూలమైన గ్రామాలపై దృష్టి సారించిన భద్రతా బలగాలు మావోయిస్టులకు సహకరించే వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఇందిలా ఉండగా ఎన్నికల వేళ సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి బలగాలు పెద్ద ఎత్తున అడవులను గాలిస్తున్నాయి.

## ముఖ్యమంత్రి ఆటవిడుపు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. సిఎం పరుగులకు మధ్యలో ఘూ పాడైపోగా, అవి లేకుండానే కొద్దిసేపు ఆటలో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన టీమ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి జ్ఞాపికను అందజేశారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్, టిఎంఆర్ఐఇఎస్ అధ్యక్షులు ఫహీం ఖురేషీ, హెచ్‌సియు ఎన్‌ఎస్‌యుఐ నేతలు ఈ ఆటలో పాల్గొన్నారు. సిఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణు గోపాల్, టిశాట్ సిఇఓ వేణు గోపాల్‌రెడ్డి తదితరులు ఆటను తిలకించారు.



## భూభాగం వెనక్కి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన మీడియా సమావేశంలో ఢిల్లీ సిఎం మాట్లాడుతూ 'మోడీ కి గ్యారంటీ' కావాలో, 'కేజ్రీవాల్ కి గ్యారంటీ' కావాలో తేల్చుకోవాలని ప్రజలకు సూచించారు. అయితే తాము ప్రకటించిన గ్యారంటీపై ఇండియా కూటమి నేతలతో చర్చించలేదని, అయినప్పటికీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేసేందుకు ఒత్తిడి తెస్తామన్నారు. ఇప్పటికీ ఢిల్లీలో ఉచిత విద్యుత్, మంచి స్కూళ్లు, మోహల్లా క్లినిక్స్ వంటి హామీలను ఆప్ అమలు చేసిందన్నారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యంతోపాటు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పించనున్నట్లు కేజ్రీవాల్ ప్రకటించారు. సైన్యంలో నియామకాలకు ఉద్దేశించిన అగ్నివీర్ పథకం రద్దుతోపాటు స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా రైతులు పండించిన పంటలకు కనీసమద్దతు ధర కల్పించనున్నట్లు కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీకి సంపూర్ణ రాష్ట్ర హోదాను కూడా కల్పిస్తామని వాగ్దానం చేశారు. 'దేశవ్యాప్తంగా 24 గంటలు విద్యుత్ ఇస్తాం. ఎలా ఇస్తామంటే దేశంలో3లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. వేసవికాలంలో అత్యధిక డిమాండ్ 2లక్షల మెగావాట్లు మాత్రమే. డిమాండ్ కంటే ఎక్కువ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అయినా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. అందుకు నిర్వహణ లోపమే కారణం. విద్యుత్ ఉన్నప్పటికీ ఢిల్లీ, పంజాబ్‌లో ఇలాంటి పరిస్థితులే ఉండేవి. నిర్వహణలోపాలను సరిదిద్ది ఢిల్లీ, పంజాబ్‌లో 24గంటలూ విద్యుత్ ఇస్తున్నాం. దేశంలో కూడా చేసి చూపిస్తాం. ఎందుకంటే మాకు ఆనుభవం ఉంది. దేశంలోని పేదలకు ఉచిత విద్యుత్‌ఇస్తాం. ఢిల్లీ, పంజాబ్‌లో చేసి చూపించాం. దేశంలో కూడా చేసి చూపించగలం. అందుకు లక్షా 23వేల కోట్లు అవుతుందని లెక్క వేశాం. నేను గాలిమాటలు చెప్పటం లేదు. కేజ్రీవాల్‌గ్యారంటీ అంటే మార్కెట్లో ఒక బ్రాండ్. మేం ఒకమాటచెబితేపూర్తిచేసిచూపుతాం'అనిఅన్నారు.

**'21 రోజులే బయట ఉంటా–'**

మరోవైపు, ఆదివారం ఢిల్లీలో తన పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయిన అరవింద్ కేజ్రీవాల్, తాను ఎన్నికలు ముగిసే వరకు 21 రోజులు మాత్రమే బయట ఉంటానని పేర్కొన్నారు. తమ ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేలను కేంద్రం ఏమాత్రం కదిలించలేకపోయిందన్నారు. ఇక పంజాబ్ ప్రభుత్వాన్ని దెబ్బతీయాలన్న ప్రత్యర్థుల వ్యూహం కూడా పారలేదన్నారు. దేశం మొత్తం బిజెపి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఆప్ ఎమ్మెల్యేల ఐక్యతను చూసి దేశం గర్వపడుతోందని చెప్పారు. జూన్ 2న తాను తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, ఆ సమయంలో పార్టీ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. తన అరెస్టు తర్వాత ఆప్ మరింత బలపడిందని వెల్లడించారు.

## ఉరుములు, మెరుపులు

(మొదటి పేజీ తరువాయి)

రమేష్‌లకు గాయాలవ్వగా, సంటెన్న అనే మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులందరినీ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బాధితులను పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు.

### ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో కూలిన టెంట్లు

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గాలి, ఉరుముల మెరుపులతో భారీగా కురుస్తున్న వర్షంతో జిల్లా కేంద్రం అతలాకుతలం అయింది. జిల్లా కేంద్రంలోని పిటిజి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో టెంట్లు పూర్తిగా కింద పడిపోయినాయి. దీంతో టెంట్ కింద ఉన్నటువంటి ఎన్నికల సిబ్బంది పాఠశాల గదులలోకి వెళ్లి తలదాచుకున్నారు. వర్షంలోనే వర్షంలోనే ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రిని తీసుకుని బస్సులలో బయలుదేరారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో ఉన్నటువంటి పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి చాలా కష్టమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

### ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశకం ఉందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు నాలుగవ విడుత ఎన్నికల వేళ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించడంతో అధికార యంత్రాంగం ఆయోమాయానికి గురవుతుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండల వేడిమి తట్టుకునేందుకు పోలింగ్ కేంద్రల వద్ద షామియానాలు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అయితే గడచిన కొన్ని రోజులుగా చెదుర మదురుగా రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. మరో ఐదు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయనే విషయాన్ని వాతావరణ శాఖ వెల్లడించారు. అయితే ఇప్పటికే ఈ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ వానలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

## సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అయితే సున్నిత, సమస్యాత్మకంగా ఉన్న 9,900 పోలింగ్ కేంద్రాల్లో మాత్రం పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4.00 గంటలకే ముగియనుంది. 12 వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల మంది ఉద్యోగులు పోలింగ్ విధులను నిర్వహించనున్నారు. 87వేల ఇవిఎం యూనిట్లు వినియోగించగా అదనంగా మరో 20 వేల బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో పెట్టారు.

### 5:30 గంటలకు మాక్ పోలింగ్

సోమవారం ఉదయం 5:30 గంటలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లతో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఒక వేళ ఏజెంట్లు అందుబాటులో లేకపోతే 15 నిమిషాల అనంతరం అధికారులే మాక్‌పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లు, బందోబస్తు, ఇవిఎంల తరలింపు తదితర అంశాలపై ఎన్నికల ప్రధాని అధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో పాటు 17 లోక్‌సభ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో తాజా పరిస్థితుల పైన సమీక్షించారు. ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు రాకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను జరిగేలా చూడాలని ఆయన జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. కాగా జిల్లా ఎన్నికల అధికారులు డిఆర్‌సి కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఇవిఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించేందుకు పటిష్టమైన భద్రత చర్యలను తీసుకోనున్నారు. దీనికి సంబంధించి డిజిపి రవిగుప్తాకు పలు ఆదేశాలు జారీ చేశారు.

## పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులుతీరిన వాహనాలు



**ప్రజాపక్షం/చౌటుప్పల్:** ఏపి,తెలంగాణలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేడు ఉదయం 7గంటల నుండి జరగనున్నది. దీంతో ఆంధ్ర ఓటర్లతో పాటు....ఖమ్మం, సూర్యపేట, మిర్యాలగూడెం ప్రాంతాల ఓటర్లు హైదరాబాద్ నుండి బయలుదేరి వెళ్తున్నారు. ఏపిలో రాజకీయ పరిస్థితులు ఆసక్తిగా ఉండడంతో ఓటర్లు స్వగ్రామాలకు పయనమయ్యారు. దీంతో విజయవాడహైద్రాబాద్ జాతీయ రహదారి వాహనాలతో రద్దీ ఏర్పడింది. ఆర్టీసి బస్సులు, కార్లలో భారీగా ఓటర్లు తరలివెళ్ళారు. పంతంగి టోల్ ప్లాజా వద్ద శనివారం అర్ధరాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వాహనాల రద్దీ కోనసాగింది. హైద్రాబాద్ నుండి ఓటర్లు స్వగ్రామాలకు వెళ్తుండడం వల్ల హైద్రాబాద్ లో ఓటింగ్ శాతం తక్కువ అయ్యే అవకాశం ఉండోచ్చని రాజకీయ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మూడంచెల భద్రత

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించాలనుకుంటే ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి. అనుమతి ఉన్న వారిని మాత్రమే స్ట్రాంగ్ రూమ్ వద్దకు వచ్చేందుకు వీలుంటుంది. అభ్యర్థులు స్ట్రాంగ్ రూమ్ వద్దకు వచ్చిన సమయంలో అక్కడి బందోబస్తు పోలీసులు వీడియో చిత్రీకరిస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాలకు సంబంధించిన ఇవిఎం మిషన్లను భద్రపరిచేందుకు దోమలగూడలోని ఎవి కళాశాల, యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం, నారాయణగూడలోనిరెడ్డి మహిళా కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీ, మాసబ్‌ట్యాంక్‌లోని జెన్‌టియు కాలేజ్, అంబర్‌పేట్‌లోని జిహెచ్ఎంసి ఇండోర్ స్టేడియం, మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, కోఠి ఉమెన్స్ కాలేజి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల, వనితా కాలేజి, బషీర్‌బాగ్‌లోని నిజాంకళాశాల, బండ్లగూడలోని ఆరోరా కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.దీంతో పాటు ఆయా జిల్లా కేంద్రాలలో సైతం స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

## 4వ విడత పోరు నేడే

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్నాయి. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. నాల్గొవ విడతలో పోటీలో ప్రముఖులు సమాజవాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, కేంద్రమంత్రులు గిరిరాజ్ సింగ్, నిత్యానందరాయ్, టిఎంసి ఫైర్‌బ్రాండ్ నేత మహువా మొయిత్రి, కాంగ్రెస్ నేత అధీర్‌రంజన్ చౌదరి, మాజీ క్రికెటర్ యూసుఫ్ పటాన్, బిజెపికి చెందిన పంకజ్ ముండే, ఎఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసి, ఏపి కాంగ్రెస్ చీఫ్ వైస్ ఎస్ షర్మిల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తం కానుంది. ఈ విడతలో ఎన్నికలు జరిగే 96 స్థానాల్లో గత ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ 40 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ఇదిలా ఉండగా, మొదటి విడత ఎన్నికల్లో 66.14 శాతం, రెండవ విడతలో 66.71 శాతం, మూడవ విడతలో 65.68 శాతం ఓటింగ్ నమోదైంది. 2019తో పోల్చితే తీవ్ర ఎండల కారణంగా ఈసారి ఓటింగ్ శాతం తగ్గినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## జమిలీ ఎన్నికలు సమాఖ్య వాదానికి ప్రమాదం



'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'' నినాదాన్ని ప్రచారం చేస్తున్న బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే, వచ్చే ఐదేళ్లలోగా జమిలీ ఎన్నికలను నిర్వహించడం ఖాయమని లోక్‌సభ ఎన్నికల సమయంలో స్పష్టం చేస్తునే ఉంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల సమస్యలు తలెత్తుతాయని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ కూడా జమిలీ ఎన్నికల సంస్కరణలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిపాదించడంతో, అందుకు అవసరమైన ప్రణాళికను రూపొందిస్తున్నట్టు మోదీ సర్కారు ఇప్పటికే ప్రకటించింది. దీనివల్ల అన్ని రాజకీయ పార్టీలకు, ఎన్నికల నిర్వహణ ఖజానాకు ఖర్చులు తగ్గుతాయని, ప్రభుత్వాలు ప్రచారం కోసం వెచ్చించే సమయం తగ్గుతుందని మోదీ ప్రభుత్వం చెప్తున్నది. మోడల్ ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) అమలులో ఉన్న సమయంలో, కొత్త పథకాలను ప్రకటించడం లేదా కొత్త కార్యకలాపాలను చేపట్టడం కుదరదు కాబట్టి, ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ప్రభుత్వాలు స్తబ్దంగా ఉండాల్సిన పరిస్థితులకు తెరవేయవచ్చని కేంద్రం చెబుతున్నది. ఏకకాల ఎన్నికలు పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని వాదిస్తున్నది. అంతేగాక, దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో లేదా కేంద్రంలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు జాతీయవాద ప్రయోజనాలకు బదులు, వ్యక్తిగత ప్రయోజనాలపై దృష్టి సారించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నది. అయితే, కేంద్రం వాదనలో అన్నీ అర్ధసత్యాలు, అసత్యాలే ఉన్నాయి. వామ పక్షాలు, కాంగ్రెస్ వంటి వివిధ ప్రతిపక్ష పార్టీల అభిప్రాయం ప్రకారం, ప్రాంతీయ, జాతీయ సమస్యలను ఏకకాలంలో వివరించే అవకాశాన్ని రాజకీయ పార్టీలు కోల్పోతాయి. భవిష్యత్ కార్యాచరణను వ్యక్తీకరించడానికి స్వయంప్రతిపత్తిగల స్థలాలను ఉపసంహరించుకోవడం వల్ల జమిలీ ఎన్నికలు మన దేశం అనుసరిస్తూ వస్తున్న సమాఖ్య వ్యవస్థను క్షీణింపచేస్తాయి. ఏకకాల ఎన్నికలు భారత దేశం అంతటా రాజకీయ జీవిత వైవిధ్యాన్ని నాశనం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తాయి. అంతేకాదు, ఎన్నికలను క్రమబద్ధీకరించడం వల్ల ఓటింగ్‌కు అవకాశాలు తగ్గుతాయి. 'అవిశ్వాసం' నియమనాలను మార్చడం, మధ్యంతర ఎన్నికలు జరిగే పరిస్థితులను తగ్గించడం వల్ల ఇబ్బందులు తప్పవు. ఇలాంటి చర్యల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వీర్యమవుతుంది. అసెంబ్లీలు లేదా లోక్‌సభలో ప్రభుత్వంపై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానాను నెగ్గితే పరిస్థితి ఏమిటి? ఒకవేళ ఏ పార్టీకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేక పోతే ఏం చేయాలి? చట్టసభను రద్దు చేసి, రాష్ట్రపతి పాలన విధిస్తే, ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు బిజెపి వద్ద సమాధానాలు లేవు. 'ఫెడరల్' స్ఫూర్తిని దెబ్బతీసి, దాని స్థానంలో 'యూనిటరీ' (ఏకీకృత) పాలనే ఆ పార్టీ లక్ష్యంగా కనిపిస్తున్నది. లా కమిషన్ 2018లో ఇచ్చిన నివేదికలో ఈ అంశాలను ప్రస్తావించింది. ఏకకాల ఎన్నికలు ఫెడరలిజానికి సవాలుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో కఠినమైన సమాఖ్య వ్యవస్థ లేనందున, ఏకకాల ఎన్నికలు ఈ విధానాన్ని అసంబద్ధం చేస్తాయనే అనే వాదనను కమిషన్ తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా కేంద్ర, రాష్ట్రాల శాసన సామర్థ్యాల పంపిణీని జమిలీ ఎన్నికల విధానం మార్చలేదు కాబట్టి, దేశంలో సమాఖ్య వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ శాంతిభద్రతలు లేదా సాయుధ బలగాలు వంటి వివిధ విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలతోపాట, వాటి పరిధిని కూడా నిర్దేశించింది. జమిలీ ఎన్నికలు నిర్వహించడం రాష్ట్రాల హక్కులను హరించడమే అవుతుంది. అంటే, పాక్షిక (క్వాసీ) సమాఖ్య విధానం మాత్రమే అమల్లో ఉంటుంది. భారత రాజ్యాంగానికి ఇది పూర్తి విరుద్ధం. విస్తారమైన దేశంలో, భిన్న ప్రాంతాలు, భిన్న సంస్కృతీసంప్రదాయాలు, భిన్న భాషలు సహజం. ఈ అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకున్న తర్వాత, రాజ్యాంగ నిర్మాతలు ఎంతో దార్శకత ప్రదర్శించి, దేశానికి మార్గనిర్దేశనం చేశారు. ఇప్పుడు జమిలీ ఎన్నికలను ప్రవేశపెట్టి, రాజ్యాంగాన్ని మార్చేసి, భారత్‌ను 'హిందూ దేశం'గా ప్రకటించే ప్రయత్నాలకు బిజెపి తెరతీసిందన్నది విపక్షాల విమర్శ. ఇది నిజమే అన్న రీతిలో బిజెపి నాయకుల ప్రచారం కొనసాగుతున్నది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా తదితరులు జమిలీ అంశాన్ని పదేపదే లేవనెత్తడమే ఇందుకు నిదర్శనం. ముంచుకొచ్చే ప్రమాదాన్ని గుర్తించి, జాగ్రత్త పడాల్సిన అవసరం ప్రజాస్వామ్యవాదులపై ఉంది. ప్రజలు కూడా విజ్ఞతతో ఓటు వేసి, దేశ భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

## దేశంలో బిజెపి వ్యతిరేక పవనాలు



దేశ వ్యాప్తంగా బిజెపి వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. 'స్క్రోల్' కథనం ప్రకారం, దేశ సంపదను ముస్లిం వర్గానికి పంచుతుందంటూ కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను పలువురు నిరసిస్తున్నారు. అదే విధంగా, బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పదేపదే ప్రకటించడాన్ని కూడా తప్పుపడుతున్నారు. ఎన్నికల వేళ, మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే రీతిలో మాట్లాడడం సరికాదని స్పష్టం చేస్తున్నారు. అదే విధంగా, సుమారు పది సంవత్సరాల క్రితం ఎంఐఎ నాయకుడు అక్బరుద్దీన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తిరిగితోడిన విధానం కూడా విమర్శలకు కారణమవుతున్నది. హిందువులతో లెక్కలు సరిచేయడానికి 15 నిమిషాల సమయం చాలని అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. కేసులు కూడా నమోదయ్యాయి. తాజాగా బిజెపి నాయకురాలు, ఒకప్పటి నటి నవనీత్ కౌర్ హైదరాబాద్ నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి మాధవీ లత తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొని, ఎంఐఎంకు 15 నిమిషాలు కావాలేమోగానీ, తమకు మాత్రం 15 సెకన్లు చాలు అంటూ సవాలు విసిరి, పాత వివాదానికి కొత్త రూపాన్నిచ్చారు. రాముడి భక్తులు అడుగునా ఉన్నారని అంటూ, తాజాగా మరోసారి వివాదానికి కారకులయ్యారు. గతంతో పోలిస్తే ఎన్నో రెట్లు ఎక్కువగా బిజెపి నేతలు ఈసారి ముస్లిం వర్గాలపై విరుచుకుపడుతున్నారు. మత ఘర్షణలు తలెత్తేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. కర్నాటకలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి అని లేబుల్ చేసిన కోడి పిల్లలను బయటకు నెట్టేసే పరాన్నజీవి పక్షిగా ముస్లింలను వ్యంగ్య చిత్రాలతో విమర్శించిన విధానాన్ని కూడా చాలా మంది, రాజకీయాలకు అతీతంగా తప్పుపడుతున్నారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవడానికి మతాన్ని అడ్డుపెట్టుకోవడం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు.

## కాలుష్య సమస్య ప్రస్తావన ఏది?



మహారాష్ట్ర కాలుష్యం కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్నప్పటికీ, శివసేన (షిండే వర్గం), బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఈ సమస్యకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ అంశం కూడా ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. పర్యావరణ చట్టాలను ఉల్లంఘిస్తున్న సిమెంట్ రెడీమిక్స్ ప్లాంట్లు, నిర్మాణ స్థలాలు మహారాష్ట్రలో చాలా ఎక్కువ. పర్యావరణ పరిరక్షణ చట్టం (1986) ప్రకారం దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలో 198 నమోదైనట్టు 2022లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) వెల్లడించింది. అంటే, సగటున ప్రతి రెండు రోజులకు ఒక కేసు నమోదైంది. ఉత్తరప్రదేశ్ 100 కేసులతో రెండో స్థానంలో ఉండగా, తెలంగాణలో తొమ్మిది కేసులు నమోదయ్యాయి. సిమెంట్ రెడీమిక్స్ ప్లాంట్లు అధిక స్థాయి వాయు కాలుష్యానికి కారణం. ముంబయి వంటి నగరాల్లో మితిమీరిన నిర్మాణాలు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రాంతాల్లో యథేచ్ఛగా జరుగుతున్న చెట్ల నరికివేత మడ అడవులకు నష్టం కలిగిస్తున్నాయి. జీవావరణానికి హాని కలిగిస్తున్న కార్యకలాపాల నిరోధానికి మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నష్టం జరిగిన తర్వాత, నామమాత్రపు విచారణలు, కంటితుడుపు చర్యలతో సరిపుచ్చుతున్నదని చాలాకాలంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శక్తివంతమైన పర్వతాలు.. దట్టమైన అడవుల నుండి సముద్ర తీరాలు, నదులు, సరస్సుల వరకు అన్ని రకాల సహజ ప్రాంతాలను రక్షించాల్సిన అవసరం గురించి శాస్త్రవేత్తలు హెచ్చరిస్తునే ఉన్నారు. పాఠశాలల్లో పర్యావరణ విద్య, వాతావరణ సంబంధ ప్రణాళికల అవసరాన్ని చెప్తునే ఉన్నారు. కానీ మహారాష్ట్ర సర్కారు ఈ అంశాలను తేలిగ్గా తీసుకున్నట్టు కనిపిస్తున్నది. పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్నందున, గత దశాబ్దంలో మహారాష్ట్రలో కరువు ఏడు రెట్లు పెరిగాయి. వరదలు, తుపాన్లు ఆరు రెట్లు అధికమయ్యాయి. ప్రాణ నష్టం, పంటల నష్టం, పునరావాస కల్పనలో విఫలం, పోషకాహార కొరత, విద్యా వసతులు తగినంతగా ఉండకపోవడం వంటి సమస్యల మధ్య బతుకుతున్న అత్యధిక శాతం మంది ప్రజలు, ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. ఈ పరిస్థితుల్లో, సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి లేదా శివసేన (షిండే వర్గం)కు అనుకూలంగా ఓటు వేస్తారని అనుకోవడానికి వీల్లేదు. పాఠశాల విద్యలో అంతరాయం, బాల కార్మికుల పెరుగుదల, సామాజిక, మానసిక ఒత్తిళ్లు, బాధలతో వలసలు తదితర అంశాలు సైతం ఈ ఎన్నికల్లో కీలక పాత్రను పోషించడం ఖాయం. 48 స్థానాలున్న మహారాష్ట్రలో ఏప్రిల్ 19న 5, 26న 8, ఈనెల 7న 11 చొప్పున స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. 13న 11, చివరిగా ఈనెల 20న 13 స్థానాల్లో జరిగే పోలింగ్‌తో మహారాష్ట్రలో సార్వత్రి ఎన్నికల ఘట్టం పూర్తవుతుంది.

## ముక్కోణంలో ఇద్దరి మధ్యే పోటీ!

### బరిలో 35 మంది - ఖమ్మం ఓటరు ఎటు మొగ్గుతాడో?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ ఉన్నప్పటికీ కాం గ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ల మధ్యనే పోటీ ఉందని భావిస్తున్నారు. బిజెపి ఓట్లు సాధించిన గెలుపు దాకా వచ్చే అవకాశం లేదన్నది విశ్లేషకుల భావన. ప్రధాన పోటీ సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ల మధ్యనే పోటీ ఉండే అవకాశం ఉంది. గతం కంటే భిన్నంగా బిజెపి ప్రచారం నిర్వహించినప్పటికీ ప్రచారానికి తగిన రీతిలో ఓట్లు రావని చైతన్యవంతమైన ఖమ్మం నియోజకవర్గంలో బిజెపికి ఓటర్లు మొగ్గే అవకాశం లేదని భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి అన్ని కలిసి వచ్చే అంశాలే. కాంగ్రెస్ పార్టీలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఈ పార్లమెంటు పరిధిలో ఉండడం పార్లమెంటు పరిధిలోని ఆరు శాసన సభ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ శాసన సభ్యులు ఉండగా మరో చోట కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన సిపిఐ శాసన సభ్యులు ఉండడం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో కాంగ్రెస్ అభ్యర్థికి సానుకూలంగా ఉండే అవకాశంగా ఉంది. కాంగ్రెస్ నాయకులు ముఖ్యంగా మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లతో పాటు శాసన సభ్యులు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, సిపిఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల నుంచి పటిష్టమైన నాయకత్వం ఉండడం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును దగ్గర చేయనుంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పక్షాన ఆ పార్టీ అధినేత కేసిఆర్ ప్రచారం నిర్వహించగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి, జిల్లా అధ్యక్షులు తాతా మధు, మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు ప్రచారం నిర్వహించారు. అధికారంలో లేకపోవడం, అర్థ బలాన్ని ప్రయోగించకపోవడం బిఆర్ఎస్ సానుకూల ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఇక బిజెపి హంగు ఆర్భాటాన్ని ప్రదర్శించినా పోలింగ్ నాటికి చల్లబడింది. బిఎస్పి సహా స్వతంత్ర అభ్యర్థులు ఎవరు ఖమ్మం పార్లమెంటు పరిధిలో ప్రభావం చూపే అవకాశం లేదు. గత 17 సార్లు ఖమ్మంపార్లమెంటు పరిధిలోని ఓటర్లు విలక్షణ తీర్పులను ఇస్తూ వస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఒక తీర్పు, పార్లమెంటు ఎన్నికల్లో మరో తీర్పు ఇచ్చే ఖమ్మం ఓటర్లు గత శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఈ దఫా జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఏ వైపుకు మొగ్గుతారో వేచి చూడాల్సిందే.

## మూడు ముక్కలైన 'టిడిపి'



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒకప్పుడు రాజకీయాలలో తిరుగులేని శక్తిగా ఉన్న తెలుగుదేశం పార్టీ 2004లో అధికారం కోల్పోయిన తర్వాత క్రమేపి బలహీనపడుతూ వచ్చింది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తెలంగాణలో నామ మాత్రంగా మిగిలింది. 2018 శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పొత్తుతో పోటీ చేసినప్పటికీ రెండు స్థానాలకే పరిమితం కాగా ఆ రెండు కూడా ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి గెలిచి టిడిపి ఉనికిని చాటింది. అటువంటి ఖమ్మంజిల్లాలో ఇప్పటికీ టిడిపికి అక్కడక్కడ క్యాడర్ ఉంది. కానీ పార్టీ అధిష్టానం నుంచి సరైన నిర్ణయం లేకపోవడం, ఉన్న పార్టీని నిర్మాణాత్మకంగా నడపలేకపోవడం నాయకునిగా చెప్పుకునే వారికి క్యాడర్‌పై పట్టు లేకపోవడం ఎన్నికలప్పుడు మినహా మిగిలిన సమయాల్లో క్యాడర్ కదలక పోవడం ఆ పార్టీని మరింత బలహీనపర్చింది. 2023 శాసన సభ ఎన్నికల సందర్భంగా పరోక్షంగానో, ప్రత్యక్షంగానో టిడిపి కాంగ్రెస్ పక్షానే నిలిచింది. 2024 శాసన సభ ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి, జనసేన, టిడిపి కలిసి పోటీ చేస్తున్నాయి. కానీ ఖమ్మం జిల్లాలో తెలుగుదేశం పార్టీ మూడు ముక్కలుగా విడిపోయి మూడు రాజకీయ పార్టీలకు మద్దతునిస్తుంది. రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు వాసిరెడ్డి రామనాథం నేతృత్వంలో కొందరు అధిష్టానం ఆదేశాలు అంటూ బిజెపికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్లమెంటరీ నాయకునిగా చెప్పుకునే కూరపాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌కు బహిరంగ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీలు, సభలు, సమావేశాల్లో కూరపాటి నాయకత్వంలో తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొనగా కొంత మంది బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. మొత్తంగా 2024 పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మూడు ముక్కలుగా విడిపోయి ఆయా పార్టీలకు మద్దతు ప్రకటించింది.

## ఎవరి ధీమా వారిది

### గెలుపు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజేపిలకు ప్రతిష్టాత్మకమే
### అసెంబ్లీ ఎన్నికల ఓట్లలో కాంగ్రెస్‌దే పైచేయి
### వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో క్లీన్‌స్వీప్
### పట్టు నిలుపుకొనేందుకు బిఆర్ఎస్, పాగా వేసేందుకు బిజెపి యత్నాలు



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికల పోలింగ్ సమయం రానే వచ్చింది. దాదాపు నెల రోజుల పాటు పతాక స్థాయిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు ఇక పోలింగ్‌పై దృష్టి సారించారు. పార్లమెంట్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెట్టారు. గత అసెంబ్లీ ఫలితాలను, అప్పుడు పార్టీల వారీగా వచ్చిన ఓట్లను విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలలో ఒకప్పుడు బిఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలలో కాంగ్రెస్ పాగా వేసింది. గడిచిన రెండు దశాబ్దాలుగా బిఆర్ఎస్ తిరుగు లేని శక్తిగా ఉన్న స్థానాలలోనూ నేడు కాంగ్రెస్‌దే హవా నడుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలలో గడిచిన లోక్ సభ ఎన్నికలలోనూ వరుసగా రెండు మార్లు బిఆర్ఎస్ అభ్యర్థులే ఘన విజయం సాధించారు. కానీ నేడు పరిస్థితి తలకిందులైంది. గత సంవత్సరం చివరిన జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది.

అసెంబ్లీ ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చిన ఊపుతో కాంగ్రెస్ ప్రస్తుతం జోరు మీద ఉంది. నేడు జరగనున్న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికలలో దీని ప్రభావం పడనుంది. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలలో నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడంతో ఇక విజయం ఖాయమనే ధీమా కాంగ్రెస్‌లో వ్యక్తం అవుతున్నది. అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ తమ సిట్టింగ్ స్థానాలను తిరిగి దక్కించుకుంటామని బిఆర్ఎస్ ఆశతో ఉంది. ఇప్పటికే బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విస్తృత ప్రచారం నిర్వసించారు. మరోవైపు బిజెపి గడిచిన ఎన్నికలలో పెద్దగా ప్రభావం చూపక పోవడంతో కొంత వెనుకబడినా లోక్‌సభ ఎన్నికలలో గట్టి పోటీని ఇవ్వాలని చూస్తున్నది. ఈ సారి వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలలో బిఆర్ఎస్ నుండి వచ్చిన కొత్త అభ్యర్థులను బరిలోకి దించింది. వరంగల్‌లో నైతే గెలుపు తమదేనన్న దీమాతో బీజేపి నాయకులు ఉన్నారు. లోక్‌సభ నియోజక వర్గాల రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభా స్థానాలు ఉన్నాయి. వీటిలో వరంగల్ ఎస్సీ సామాజిక వర్గానికి, మహబూబాబాద్ నియోజక వర్గం ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి. ఈ రెండు నియోజక వర్గాల పరిదిలో గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటి అసెంబ్లీ నియోజక వర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. వరంగల్ లోక్ సభ పరిధిలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో 6 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఒక్క స్టేషన్ ఘన్‌పూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. కాగా కడియం శ్రీహరి ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో వరంగల్ పరిధిలోని ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో కలిపి 6,63,556 ఓట్లు పొందగా బిఆర్ఎస్‌కు 4,33,368 ఓట్లు, బిజెపికి 1,56,638 ఓట్లు వచ్చాయి. ఇక మహబూబాబాద్ లోక్ సభ నియోజక వర్గం పరిధిలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో భద్రాచలం అసెంబ్లీ నియోజక వర్గంలో మాత్రమే బిఆర్ఎస్ గెలుపొందగా మిగిలిన ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. భద్రాచలం ఎమ్మెల్యే సైతం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికలలో ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్‌కు మహబూబాబాద్ లోక్ సభ నియోజక వర్గం పరిధిలో 6,85,897 ఓట్లు, బిఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు, బిజెపికి కేవలం 34,431 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ మహబూబాబాద్ లోక్ సభ నియోజక వర్గం పరిధిలో 2.30,188 ఓట్ల మెజారిటి ఉంది. దీంతో రెండు చోట్లా కాంగ్రెస్ పార్టీకి గెలుపు అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. వరంగల్ లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య, బిఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ సుధీర్ కుమార్, బిజెపి అభ్యర్థిగా ఆరూరి రమేష్ పోటీ చేస్తుండగా మహబూబాబాద్ నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాం నాయక్, బిఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత, బిజెపి అభ్యర్థిగా అజ్మీరా సీతారం నాయక్ పోటీ పడుతున్నారు.

## ఓటు ఎలా వేయాలంటే..

### ఓటింగ్ ప్రక్రియలో ఓటర్లు గమనించాల్సిన అంశాలెన్నో




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సిద్ధమయ్యాయి. తెలంగాణలో 17 ఎంపి సీట్లు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. అటు ఎపిలోనూ 25 లోక్ సభ స్థానాలతోపాటు 175 అసెంబ్లీ సీట్లకు నేడు సోమవారం పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటింగ్ ప్రక్రియపై ఓటర్ల అవగాహన కోసం ఈ కింది సూచనలు పాటించాల్సి ఉంటుంది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే మీ దగ్గరున్న ఓటర్ ఐడి కార్డు, పోలింగ్ స్లిప్‌ను చూపించాలి. మొదటి సీట్లో కూర్చొనే పోలింగ్ అధికారి మీ ఓటర్ ఐడి కార్డు సీరియల్ నెంబర్, పార్ట్ నెంబర్ ను తన వద్ద ఉండే జాబితాలోని వివరాలతో సరిపోలాయో లేదో చూసుకుంటారు. వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయని నిర్ధారణ అయ్యాక మరో పోలింగ్ అధికారి మీ ఎడమ చూపుడు వేలిపై సిరా గుర్తు వేస్తారు. మీ వివరాలను (ఓటరు ఐడి నెంబరు) ఫారం 17ఏ లో నమోదు చేస్తారు. ఓటరు జాబితాలో బొటనవేలి ముద్ర లేదా సంతకం చేయించుకుంటారు. పోలింగ్ వివరాల స్లిప్‌ను ఇస్తారు. మూడో ఎన్నికల అధికారి ఆ స్లిప్‌ను పరిశీలించి మీరు ఓటు వేయడానికి వీలుగా తన వద్ద ఉన్న ఓటింగ్ కంట్రోల్ యూనిట్ బటన్ నొక్కి మీ ఓటు నమోదయ్యేందుకు దాన్ని సిద్ధం చేస్తారు. అలాగే ఓటింగ్ కంపార్ట్‌మెంట్ లోకి వెళ్లడానికి అనుమతిస్తారు. ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన కంపార్ట్ మెంట్ లో ఓటేసే ఈవీఎం మెషీన్, దాని పక్కనే వివి ప్యాట్ యంత్రం ఉంటాయి. మీరు ఎవరికి ఓటేశారో చూపించే యంత్రమే వివి ప్యాట్. కాగా ఈవిఎంపై అభ్యర్థుల పేర్లు ఒకవైపు, వారికి కేటాయించిన గుర్తులు మరోవైపు... వాటి పక్కనే నీలి రంగు బటన్ ఉంటాయి. మీకు నచ్చిన అభ్యర్థికి కేటాయించిన గుర్తు పక్కన్నే ఉన్న నీలి రంగు బటన్ను నొక్కగానే రెడ్ లైట్ వెలుగుతుంది. బీప్ అనే శబ్దం వస్తుంది. ఆ వెంటనే వీవీ ప్యాట్ యంత్రంపై పచ్చటి లైట్ వెలుగుతుంది. వివి ప్యాట్ పై ఉండే స్క్రీన్ మీరు ఓటేసిన అభ్యర్థి తాలూకూ గుర్తు, ఈవిఎంపై కేటాయించిన క్రమసంఖ్య, పేరు ముద్రించిన కాగితపు స్లిప్ ఏడు సెకన్లపాటు కనిపిస్తుంది. ఆ తరువాత ఈ స్లిప్ బాక్సోకి పడిపోతుంది. ఆ తర్వాత మళ్లీ బీప్ శబ్దం వస్తుంది. ఇలా జరిగితేనే మీ ఓటు నమోదైనట్లు అర్థం. ఈ ప్రక్రియలో ఏది జరగలేదని మీకు అనుమానం వచ్చినా పోలింగ్ కేంద్రంలో ఉండే ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. ఆంధ్రప్రదేశ్లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు రెండూ జరుగుతున్నాయి కాబట్టి.. పోలింగ్ బూత్లో రెండు ఈవీఎంలు, రెండు వీవీ పాట్లు ఉంటాయి. ఓటర్లు రెండుసార్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి.

**ఓటర్ ఐడిలో తప్పులు దొర్లాయా?**

కొందరి ఓటరు కార్డుల్లో స్వల్ప తేడాలు (అడ్రస్ మార్పు, ఫోటో పాతది ఉండడం లేదా పేరు అక్షరాల్లో మార్పులు) ఉండొచ్చు. కానీ అంతమాత్రాన ఓటర్లు ఎలాంటి కంగారు పడాల్సిన అవసరం లేదు. ఎపిక్ వివరాల్లో స్వల్ప తేడాలున్నా ఓటరు గుర్తింపు నిర్ధారణ అయితే అధికారులు ఓటు హక్కు కల్పిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదానిని ఆధారంగా చూపాల్సి ఉంటుంది.

**ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాలు..**

ఆధార్ కార్డు, పాన్ కార్డు, జాతీయ ఉపాధి హామీ కార్డు , జాబ్ కార్డు , బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మికశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు , డ్రైవింగ్ లైసెన్స్ , రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా(ఆర్‌బిఐ ) నేషనల్ పాపులేషన్ రిజిస్ట్రార్(ఎన్‌పిఆర్ ) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు , భారతీయ పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ పత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగి గుర్తింపు కార్డులు , కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డు(యూడీఐడీ)లను చూపించి ఓటు వేసుకోవచ్చు.

# సాహితీ విహారి

## విలక్షణ సాహిత్యం.. కాఫ్కాకే సొంతం

నాలుగు పదుల జీవితంలో, సాహిత్యంతోనే నామమేకమైన గొప్ప రచయిత ఫ్రాంజ్ కాఫ్కా. ఇప్పుడు ఆయన జయంతి (జులై 3, 1883) కాదు. వర్ధంతి (జూన్ 3, 1924) అంతకంటే కాదు. కానీ, సాహిత్యం కోసమే జీవించిన ఇరవయ్యవ శతాబ్దపు అత్యంత ప్రతిభావంతుడైన జర్మన్ రచయిత కాఫ్కాను ఆయన శత జయంతి సంవత్సరం సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఉంది. సాహిత్యం అనేది కేవలం పేరు కోసం, గొప్పతాన్ని ప్రదర్శించుకోవడం కోసం ఉపయోగపడే ఒక వస్తువుగా మారిన నేటి తరుణంలో, సాహిత్యాన్ని ప్రేమించి, అందులోనే జీవించి, అక్కడే తుది శ్వాస విడవడం ఎంత మందికి సాధ్యం? సాహిత్యంతో అంతగా పెనవేసుకుపోయిన జీవితాలు ఎన్ని ఉన్నాయి? ఒక మూస పద్ధతిలో, ఆత్మస్థుతి పరనిందల ఒరవడిలో కొట్టుకుపోతున్న ఎంతో మంది రచయితలకు ఆయన జీవితం ఒక పాఠం. ఆయన మార్గం అనుసరణీయం.

'నేను సాహిత్యాన్ని మాత్రమే
అంతకంటే మరేమీ కాను
సాహిత్యం ద్వారానే జీవితాన్ని పట్టుకొని
వేళాడుతున్నాను
దాన్ని కోల్పోతే సర్వం కోల్పోయినట్టే' అంటాడు కాఫ్కా. సాహిత్యాన్ని అంతలా ప్రేమించడం ఎంత మందికి సాధ్యం? ఆయన దృష్టిలో రచన చావు కన్నా గాఢమైన నిద్రలాంటిదది. శవాల్ని సమాధి నుంచి బయటకు లాగడం ఎలా సాధ్యం కాదో... రాత్రిళ్లు అతనిని తన డెస్క్ నుంచి ఎవరూ వేరుచేయలేరు. ఎందుకంటే, 'నేను సాహిత్యానికి కనపడని గోలుసుల ద్వారా కట్టివేయబడ్డాను. ఎవరైనా దగ్గర కొస్తే, నా గొలుసులు ముట్టుకుంటున్నారేమో అని అరుస్తాను' అని కాఫ్కా స్వయంగా చెప్పుకున్నాడు. ఆయన పలు నవలలు, కథలు రాసిన గొప్ప రచయిత, అస్థిత్వవాద శైలిపై అత్యంత ప్రభావం చూపిన రచనలు చేసి, కీర్తిప్రతిష్టలు ఆర్జించాడు. ప్రస్తుత కాలానికీ కాఫ్కాకూ విడదీయలేని సంబంధం ఉంది. జీవితాన్ని సంపూర్ణంగా సాహిత్యానికే వచ్చించిన అతను, ఇరవయ్యో శతాబ్దంలో నిత్యం సందిగ్ధంలో పడి కొట్టుమిట్టాడే వారిని తట్టిలేపింది. వారిలో చైతన్య స్ఫూర్తిని నింపింది. సాహిత్యంతో అతను ఎంతలా సహవాసం చేశాడంటే, రచనలు చేసే సమయంలో ఎవరినీ దగ్గరికి కూడా రానిచ్చేవాడు కాడు. ఒక విశాలమైన సెల్లార్‌లో, ఒక మారుమూల గదిలో దీపం ముందు తన రాత సామాగ్రిని పెట్టుకొని కూర్చునేవాడు. అదే అతని ప్రపంచం. అదే అతనికి సర్వస్వం. భోజనం తెచ్చే వాళ్లు కూడా అతని సమీపానికి వెళ్లేందుకు జంకేవాళ్లు. అందుకే, సెల్లార్ మొదట్లోనే భోజనం ఉంచి, మాయమయ్యేవాళ్లు. తన గది నుంచి భోజన పాత్ర ఉంచిన ప్రదేశం వరకూ చేరుకోవడం ఒక్కటే కాఫ్కా వ్యాయామం. పాత్ర తీసుకొని తిరిగి తన బల్ల వద్దకు వెళ్లేవాడు. మళ్లీ రాసేవాడు. గుర్తుకొచ్చినప్పుడు కొద్దిగా తినేవాడు. మళ్లీ రాసుకునేవాడు. అంతే.. అదే అతని దినచర్య. 'ఎలా రాస్తాననుకున్నావ్? ఎంతెంతటి గుండెలోతుల్లో నుంచి తవ్వి తీస్తాననుకున్నావ్? అయితే, నాకు శ్రమ అనిపించదు. ఎందుకంటే, తీక్షణమైన ఏకాగ్రతకు శ్రమ తెలియదు' అంటా కాఫ్కా. బాధ లేదా సంతోషం.. ఎలాంటి మానసిక భావనైనా మన మనసు ఫలకాల్లో నిక్షిప్తమై, దృశ్యాల రూపంలో కళ్ల ముందు కదలాడుతుంది. కాఫ్కా రచనలు కూడా అలాంటివే. 'ఎ కంట్రీ డాక్టర్' కథలో ఒక పల్లెటూరి వైద్యుడు తన వృత్తి జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను, ఒక కల మాదిరి అద్భుతంగా ఆవిష్కరించాడు. 'బిఫోర్ ది లా' కథలో, న్యాయం కోసం ఒక సామాన్యుడు జీవితాంతం ఎదురు చూసే పరిస్థితిని కళ్లకు కట్టాడు. రాయడమే తప్ప, వాటిని ప్రచారం చేసుకునే అలవాటు లేదు కాబట్టే, 'కాన్టెంప్లేషన్', 'ఎ కంట్రీ డాక్టర్' వంటి కథా సంకలనాలు, కొన్ని కథలు మాత్రమే ఆయన జీవించి ఉండగా, కొన్ని సాహిత్య పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఎక్కువ శాతం రచనలు ఆయన మరణానంతరమే వెలుగులోకి వచ్చాయి. కాఫ్కాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన 'ఎ హంగర్ ఆర్టిస్ట్' అనే కథా సంకలనం కూడా ఆయన మరణానంతరమే ప్రచురకు నోచుకుంది. అప్పటి సమాజ తీరుతెన్నులకు భిన్నంగా ఆలోచించేవాడు కాబట్టే, తన రచనలను ముద్రణ కోసం పత్రికలకు పంపించడం కాఫ్కాకు నచ్చేది కాదు. నిజానికి తన మరణానంతరం అన్ని రచనలను కాల్చివేయాలని ఆయన స్నేహితుడు మాక్స్ బ్రాడ్‌ను కోరాడు. అయితే, బ్రాడ్ అతని కోరికను మన్నించలేదు కాబట్టే, కాఫ్కా రచనలు మనకు లభ్యమయ్యాయి. అతని అసంపూర్ణ నవలలు డెర్ ప్రాసెస్.. డాస్ స్కోస్, అమేరికా వంటి అనేక రచనలను బ్రాడ్ ఎంతో శ్రద్ధ తీసుకొని అచ్చు వేయించాడు. తద్వారా ఒక కొత్త రచనా విధానం ప్రపంచానికి పరిచయం చేశాడు. మానసిక విశ్లేషణలో కాఫ్కాను మించిన వారు లేరని అతను రాసిన 'లెటర్ టు ఫాదర్' అనే వంద పేజీల ఉత్తరం రుజువు చేస్తుంది. ప్రపంచ సాహిత్య చరిత్రలో ఇంతకు మించిన గొప్ప మానసిక విశ్లేషణా వ్యాసాన్ని మరెవరూ రాయలేకపోయారు. కనీసం, ఆ ఉత్తరం దరిదాపుల్లో చేరే విశ్లేషణలు కూడా రాలేదు.


ప్రేయసి ఫెలిస్‌తో కాఫ్కా

పిల్లల పట్ల తల్లిదండ్రుల కర్తవ్యాన్ని అతను ఈ వ్యాసంలో చాలా గొప్పగా వివరిస్తాడు. బహుశా తన బాల్యమే అతనిని ఈ రచనకు పురిగొల్పి ఉంటుంది. ఒక యూదు కుటుంబంలో పుట్టాడు. తండ్రి హెర్మన్, తల్లి జూలీ. ఇద్దరిదీ మధ్యతరగతి మనస్తత్వం. డబ్బు సంపాదించే క్రమంలో కుటుంబాన్ని పట్టించుకునే తీరిక హెర్మన్‌కు ఉండేది కాదు. తీవ్ర నిర్లక్ష్యానికి గురైన కాఫ్కా, తండ్రి ప్రేమ కోసం తపించిపోయాడు. కానీ, అది అతనికి జీవితకాలంలో లభించలేదు. తాను పొందిన మనో వేదనే 'లెటర్ టు ఫాదర్' రూపంలో బయటపడింది. ఈ రచన కూడా అతని మరణానంతరమే ప్రచురితమైంది. 'డై వెర్వాండ్‌లంగ్' (ది మెటామొనొఫొసిస్), 'డెర్ ప్రొసెస్' (ది ట్రయల్), 'దాస్ ఉర్టెయిల్' (ది జడ్జిమెంట్), 'బ్రీఫె ఆన్ ఫెలిస్' (లెటర్ టు ఫెలిస్) వంటి అద్భుతమైన రచనలను అందించిన కాఫ్కా గొప్ప రచయిత మాత్రమే కాదు.. గొప్ప మానవతావాది కూడా. దాదాపుగా అతని ప్రతి రచనా ఎంతో మందిని ప్రభావితం చేసింది. ఆల్బర్ట్ కామూ లేదా జీన్ పాల్‌సాత్రే.. గాబియల్ గార్సియా మార్క్వెజ్ లేదా వాల్ట్ విట్‌మన్.. ఇలా ఎంతో మంది ప్రపంచ ప్రసిద్ధ రచయితలు కాఫ్కా కలానికి నీరాజనాలు పలికిన వారే. ఆయన రచనా శైలిని అనుసరించడానికి ప్రయత్నించిన వారే. 'మెటమార్ఫసిస్' నవల గురించి, ఎంతో మంది, ఎన్నో సందర్భాల్లో ప్రస్తావించడం కొత్తేమీ కాదు. ఎన్నిసార్లు చెప్పినా.. ఎంతగా చెప్పినా ఆ నవలను అతను నడిపించిన తీరును వివరించడం కష్టమే. గ్రెగర్ జమ్జా అనే వ్యక్తి కలత నిద్ర నుంచి లేచేసరికి పెద్ద కీటకంగా మారిపోయినట్టు గుర్తిస్తాడు. ఆ తర్వాత అతను ఎదుర్కొన్న సమస్యల నేపథ్యంలో నవల కొనసాగుతుంది. ఈ రచనతోనే కాఫ్కా ఆధునిక రచనా శైలికి బీజం వేశాడు. ఎంతో మంది రచయితలు, వినూత్న రీతుల్లో రచనలు చేయడానికి స్ఫూర్తినిచ్చిన నవలగా 'మెటమార్ఫిసిస్' నిలుస్తుంది. అప్పటి వరకూ ఒక మూస విధానంలోనే రచనలు ఉండేవి. సాహిత్యం వాస్తవికతకు దూరంగా, కృతకంగా ఉండేది. కాఫ్కా రచనలు వెలుగు చూసిన తర్వాత, ప్రపంచ సాహితీ ముఖచిత్రమే ఒక్కసారిగా మారిపోయింది. కొత్తకొత్త ఆలోచనలు... సరికొత్త పోకడలు సాహిత్యంలో చోటు సంపాదించుకున్నాయి. రచనకు ఉన్న చట్రాలు చెదిరిపోయాయి. రచయితలు తగిలించుకున్న శృంఖలాలు తెగిపడ్డాయి. స్వాప్నిక లోకాల్లో విహరిస్తూ... మనసు లోతుల్లోని అంతర్‌లోకాలను స్పృశిస్తూ.. మనసు కళ్లతో చూసిన వాస్తవాలను, అనుభవాల అక్షరాలుగా మార్చినప్పుడు మాత్రమే కనీసం కాఫ్కా దరిదాపుల్లోకి చేరుకోవడం సాధ్యమవుతుంది. కానీ, అది అనుకున్నంత సులభం కాదు. అందుకే, కాఫ్కాను కాఫ్కాతోనే పోల్చాలి. మరెవరూ ఆయన సమీపంలో కూడా మరి. ఎంత మంది స్త్రీలతో సన్నిహితంగా ఉన్నప్పటికీ, ఫెలిస్‌తోనే వివాహ బంధాన్ని ఏర్పరచుకోవాలని కాఫ్కా కలలు కన్నాడు. కానీ, క్షయ వ్యాధి సోకిన కారణంగా తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. కేవలం నలభై ఏళ్ల వయసులోనే మృతి చెందినప్పుడు, కాఫ్కా పాత ప్రేయసి మిలెనా రాసిన నివాళి పత్రం అతని వ్యక్తిత్వాన్ని మనకు పరిచయం చేస్తుంది. 'కాఫ్కా భయస్తుడు.. సున్నిత మనస్కుడు... బియడస్తుడు.. మంచివాడు. కానీ, అతని రచనలే ఎంతో క్రూరంగా ఉంటాయి. ఎందుకో తెలుసా? అవి చదువుతున్నంత సేపూ మనల్ని బాధ పెడతాయి. మనతో కన్నీళ్లు పెట్టిస్తాయి. కాఫ్కా జీవించలేనంత విజ్ఞుడు. పోరాడలేనంత బలహీనుడు. స్వచ్ఛమైన మనుషులకు... మనసులకు ఈ లోపం తప్పదేమో' అంటూ సాగిన ఆ నివాళి కాఫ్కాను అర్థం చేసుకోవడానికి ఊతమిస్తుంది. కాఫ్కా మరణించిన కొన్నాళ్ళకి హిట్లర్ నేతృత్వంలోని నాజీల దురాగతాల్లో అతని చెల్లెళ్ళూ, ఇతర కుటుంబ సభ్యులూ కాన్సన్‌ట్రేషన్ కాంపుల్లో చనిపోయారు. నాజీలే అతను ఊహించిన భూతాలేమో! దార్శనికుడు కాబట్టే కాఫ్కా రచనలు ఇప్పటికీ నిత్య నూతనంగా ఉన్నాయి. శత జయంతి సంవత్సర నేపథ్యంలో, ఆ మహా రచయితకు నివాళులు.

**— సత్యశ్రీ**

## కశ్మీర్ పరిస్థితులకు అద్దంపట్టే రచనలు







కాశ్మీర్ గురించి పాలకులు చెప్తున్న మాటలకు, వాస్తవ పరిస్థితులకు ఎక్కడా సంబంధం ఉండదు. ఎంతోమంది రచయితలు అక్కడ రావణకాష్టంలా కొనసాగుతున్న ఉద్రిక్త, హింసాత్మక ఘటనలను ప్రపంచానికి తెలియచెప్పే ప్రయత్నం చేశారు. అలాంటి రచయితల్లో మీర్జా వహీద్, బషరత్ పీర్ పేర్లను ముందుగా ప్రస్తావించుకోవాలి. వహీద్ తొలి నవల 'ది కాలా బరేటర్', పీర్ నవల 'మెమోయిర్ కర్ఫ్యూడ్' కశ్మీర్‌లో హింసకు సంబంధించిన వైవిధ్యమైన దృశ్య, భౌతిక, రహస్య రూపాలను మన కళ్లకు కడతాయి. బాధితుల భయానక భావనలు, ప్రతిఘటనలు, బతుకు పోరాటాలను ఆవిష్కరిస్తాయి. కశ్మీర్ ప్రజల దృక్పథాలు, వారి అవగాహనలు, జీవితాలను పునర్నిర్మించుకోవడానికి పడుతున్న అవస్థలను కూడా ఈ ఇద్దరు రచయితలు తమతమ నవలల్లో అద్భుతంగా వర్ణించారు. ఈ రెండు నవలల్లోనూ మృతదేహాల అసాధారణ ఉనికిని మనం చూస్తాం. శవాలు 'సింబాలిక్ క్యాపిటల్' కలిగి ఉన్నాయని నమ్మడం కొంత ఇబ్బందికరమైన అయినా, రచయితలు తమ వాదనను అద్భుతం గా నిర్మించుకున్నారు. బయో పాలిటిక్స్, నెక్రో పాలిటిక్స్ ప్రత్యేక కలయిక ఈ రచనల్లో కనిపిస్తుంది. మృతదేహాల ఉనికి ద్వారా హింసాత్మక నిర్మాణాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన రాజకీయాలను సూచిస్తాయి. ప్రజల ముందు ఉన్న విభిన్న మార్గాలను కూడా ప్రస్తావిస్తాయి. ఫిరోజ్ రాథర్ చిన్న కథల సంకలనం 'ది నైట్ ఆఫ్ బ్రోకెన్ గ్లాస్'(2019) వేరొక రకమైన హింస ను అధ్యయనం చేస్తుంది. 'క్రిస్టల్‌నాచ్ట్'ను గుర్తుచేస్తుంది. 1938 లో, జర్మనీలో వేలాది మంది యూదులను అరెస్టు చేసిన లేదా చంపిన హింసాత్మక సంఘటనలు ప్రారంభమయ్యా యి. నాటి ఘటనలు, అప్పటి భయానక వాతావరణాన్ని వస్తువుగా తీసుకొని, ఒకదానితో మరొకటి అనుసంధానం చేస్తూ కథల సంపుటాన్ని ఫిరోజ్ వెలువరించారు. ఈ కథల ద్వారా పోస్ట్‌కలోనియల్ భయానక భావనను చర్చించారు. కశ్మీర్‌లోనూ హింసకు ఉగ్రవాదం ఎలా కారణమవుతుందో చెప్తూనే, హింను నిర్వహించానికి ప్రయత్నించారు. హింసకు, ఉగ్రవాదానికి ఉన్న తేడాతను సూక్ష్మంగా పరిశీలించారు. కశ్మీర్‌లోని భయంకరమైన హింసను గోతిక్ నుండి పోస్ట్ కలోనియల్ హర్రర్ వరకు ఉన్న పరిస్థితులతో పోల్చవచ్చని ఫిరోజ్ కథలు చదివితే అర్థమవుతుంది. కాగా, కశ్మీర్ గురించి రాయడానికి యూరోపియన్ రచయితలు కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. పాశ్చాత్య దృక్కోణం నుండి చూసే ప్రస్తుత సంఘర్షణ లోతును అర్థం చేసుకోడం సాధ్యం కాదు. రోసీ థామస్ రాసిన 'కశ్మీర్ షాల్'లో పూర్తి దృశ్యాన్ని రచయిత్రి ఆవిష్కరించలేకపోయింది. అయితే, పరిస్థితులను పరిచయం చేసే ప్రయత్నం మాత్రం జరిగింది. ఏదిఏమైనా కశ్మీర్‌లో నెలకొన్న దుర్భర పరిస్థితులపై రచయితలు స్పందించడం, కథలు, కవితలు, నవలలు రాయడం ఆహ్వానించతగ్గ పరిణామం. సమకాలీన సమస్యలపై స్పందించినప్పుడే కదా రచనలకు గుర్తింపు.. సార్థకత.

## హన్నాకు పులిట్జర్ ప్రైజ్



జర్నలిజం, కళా రంగాల్లో అత్యంత ప్రతిష్టాత్మక పులిట్జర్ పురస్కారాలను 2024 సంవత్సరం కోసం ప్రకటించగా, పరిశోధనాత్మక రిపోర్టింగ్ విభాగం లో హన్నా డ్రయర్ (ది న్యూయార్క్ టైమ్స్) దక్కించుకుంది. అమెరికాలోని కొలంబియా విశ్వ విద్యాలయం అందచేసే ఈ అవార్డులకు, ప్రజాసేవ విభాగంలో ప్రో పబ్లికా (జాషువా కప్లాన్, జస్టిన్ ఇలియట్, బ్రెట్ మర్ఫీ, అలెక్స్ మియర్జెస్కి. కిర్స్టెన్ బెర్గ్), అంతర్జాతీయ రిపోర్టింగ్ విభాగంలో 'ది న్యూయార్క్ టైమ్స్' సిబ్బంది, సంపాదకీయ రచనలో డేవిడ్ ఇ. హాఫ్‌మన్ (ది వాషింగ్టన్ పోస్ట్), బ్రేకింగ్ న్యూస్ ఫొటోగ్రఫీలో రాయిటర్స్ ఫొటోగ్రఫీ సిబ్బంది, ఫీచర్ ఫోటోగ్రఫీలోఅసోసియేటెడ్ ప్రెస్ ఫొటోగ్రఫీ సిబ్బంది ఎంపికయ్యారు. అదేవిధంగా ఆడియో రిపోర్టింగ్ విభాగంలో ఇన్విజిబుల్ ఇన్‌స్టిట్యూట్, యుఎస్‌జి ఆడియో సిబ్బంది సంయుక్తంగా బహుమతిని పొందారు. అదే విధంగా పుస్తకం, నాటకం, సంగీతం విభాగాల విషయానికి వస్తే, ఫిక్షన్‌లో జేన్ అన్నే ఫిలిప్స్ రాసిన 'నైట్ వాచ్', నాటకం విభాగంలో ఎబోని బూత్ రచించిన 'ప్రైమరీ ట్రస్ట్', చరిత్ర విభాగంలో జాక్వెలిన్ జోన్స్ రాసిన 'నో రైట్ టు ఏ హానెస్ట్ లివింగ్: ది స్ట్రగుల్స్ ఆఫ్ బోస్టన్ బ్లాక్ వర్కర్స్ ఇన్ ది సివిల్ వార్ ఎరా' ఎంపికయ్యాయి. జీవిత చరిత్ర విభాగానికి వస్తే,'ఇలియన్ వూ రచించిన 'యాన్ ఎపిక్ జర్నీ ఫ్రమ్ స్లేవరీ టు ఫ్రీడమ్ అవార్డును దక్కించుకుంది. జ్ఞాపకం మరియు ఆత్మకథ విభాగంలో ఇలియానా రాసిన 'ఇన్విన్సిబుల్ సమ్మర్', క్రిస్టినా రివెరా గార్జా రాసిన 'ఎ సిస్టర్స్ సెర్చ్ ఫర్ జస్టిస్' అవార్డుకు ఎంపికయ్యాయి. కవిత్వం విభాగంలో బ్రాండన్ సోమ్ పద్యాలు 'ట్రిపాస్', సంగీతం విభాగంలో అడాజియో (వడాడ లియో స్మిత్), సాధారణ నాన్ ఫిక్షన్ 'ఏ డే ఇన్ లైఫ్ (అబేద్ సలామా), 'అనాటమీ ఆఫ్ జెరుసలేం ట్రాజిడీ' (నాథన్ థ్రాల్) దక్కించుకున్నాయి. పులిట్జర్ ప్రైజ్‌ను ఈ వార్తాపత్రిక యజమాని జోసెఫ్ పులిట్జర్ 1904లో నెలకొల్పారు. జర్నలిజం, కళలు, సంస్కృతిలో నైపుణ్యానికి ప్రోత్సాహకంగా ఈ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. కొలంబియా యూనివర్శిటీలోని జర్నలిజం ఫ్యాకల్టీకి బహుమతులను అందించడానికి అతను డబ్బును విరాళంగా ఇచ్చాడు. మొదటి పులిట్జర్ బహుమతులు 1917లో అందించారు. అప్పటి నుంచి ఏటా ఈ రంగాలలో అత్యుత్తమ విజయాలను గుర్తిస్తూ, బహుమతి ప్రదానం చేస్తునే ఉన్నారు.

## సభలు.. సమావేశాలు..




కెకెఆర్ తృతీయ వర్ధంతి సభ హైదరాబాద్ అబిడ్స్‌లోని తిలక్ రోడ్డులో ఉన్న తెలంగాణ సారస్వత పరిషత్ హాలులో ఈనెల 15వ తేదీ, బుధవారం సాయం త్రం 6 గంటలకు జరుగుతుంది. 'ఆధునికత—ఆధునికానంతరత' అంశంపై తిరుపతిలో తత్వశాస్త్ర ఆచార్యులు వడ్లూరి రఘురామ రాజు ప్రసంగిస్తారు. కెకెఆర్ ప్రసంగ పాఠాలతో కూర్చిన 'సాహితీ వ్యక్తిత్వం' పుస్తకావిష్కరణ జరుగుతుంది.

### 'జీవజలం చలం'

'హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌ల ఈనెల 18వ తేదీ, శనివారం సాయంత్రం 6 గంటలకు 'జీవ జలం చలం' సాహిత్య సభ పేరుతో చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది. 'చలం మ్యూజింగ్స్... వస్తు రూపాలు' అంశంపై డాక్టర్ కాత్యాయనీ విద్మహే, డాక్టర్ సి. మృణాళిని ప్రసంగిస్తారు. చలం మ్యూజింగ్స్‌లోని కొన్ని భాగాలను సిహెచ్ ఉషారాణి, మెర్సీ మార్గరేట్, జ్వలిత, కొల్లాపురం విమల, కొండపల్లి నీహారిణి, ఐనంపూడి శ్రీలక్ష్మి, వాసరచెట్ల జయంతి చదువుతారు. చలం మ్యూజింగ్స్‌పై మామిడి హరికృష్ణ ప్రసంగిస్తారని చలం భావన కన్వీనర్ కళేశ్వరం శంకరం తెలిపారు.






### సామెత

'కథలకు కాళ్ళు లేవు, ముంతలకు చెవులు లేవు' అని సామెత. కథకు కాళ్ళు లేకపోవడమేమిటి? దేశమం తా తిరుగుతుంది కదా? ఈ సామెత ఉద్దేశం ఏమిటి?

కథ దేశమంతా తన కాళ్ళ మీద తిరుగుతోందా? లేదు కదా. దానంతట అది తిరగడానికి దానికి కాళ్ళు లేవు. ఒకరి కొకరు చెప్పుకోవడం ద్వారానే అది వ్యాప్తి చెందుతుంది.

కథ వినేసి ఊరుకోకూడదు, మరొకరికి చెబితేనే దానికి కదలిక. అందుకే కథకు కాళ్ళు లేవు అన్నారు.

ఇక ముంతకు చెవు లు ఉండవన్నది అందరికీ తెలిసిందే.

## ఈ వారం కవితలు

### అమ్మ...




సృష్టికి జీవిత కాలమిచ్చిన
ఆది గురువు అమ్మకు
మనుషులు అమ్మదే ఒక్క రోజంటూ
కోడై కూస్తున్నారు...

అమ్మలేని రోజు ఉంటుందా..?
పిల్లలకు హాస్టల్లు...
తల్లిదండ్రులకు వృద్ధాశ్రమాలు ..
ఇదీ ఆధునికీకరణ అట
ఎంత విడ్డూరం.....?
అమ్మ పిలుపుకు
సముద్రాల దూరాన
ఖరీదైన కోటుకు
మరకలు పడకుండా
కోట్లకోసం పరుగులతో
అమ్మకు ఒక్క రోజంటూ
వీడియో కాల్‌లో
కలుషిత పాదాభివందనాలు....

ఎవరికోసం ఈ బ్రతుకులు..?
తన కడుపు మాడ్చుకొని
మన కడుపు నింపిన
సమయం గుర్తుకు రాలేదా?
నేటి చదువులు
ఒంటబట్టించుకొని సంస్కారం
మరిచి దూరం చేస్తున్నాయి...
అమ్మ ప్రేమ, అనురాగాలను
ఆప్యాయతలను మరిచి
బ్రతికుండగా తల్లిదండ్రుల
కన్నీళ్లకు కారణమై
కర్మకాండలను మాత్రం
ఘనంగా....
ఇది ఆధునీకరణ ముసుగులో
మనుషుల నిజస్వరూపాలు.
అమ్మా నీకు పాదాభివందనాలు...
(మే రెండవ ఆదివారం మదర్స్ డే సందర్భంగా)

**పాకాల శంకర్ గౌడ్**
9848377734.

### నవోదయం!

ఎన్నాళ్ళో వేచిన ఉదయం ఇది!
కొత్తగా తెల్లారినా కొత్త పొద్దుకోసం
కోటి ఆశలతో ఉత్కంఠ భరిత
మనసుల్ని గుప్పిట బిగించి
ఎన్నికల రణక్షేత్రానికి తరలి
వస్తున్నారంతా సిబ్బంది కత్తులు
కటార్లు సిద్ధం చేసుకొంటుంటే
సీలు వేసిన ఇనుప బ్యాలెట్
బాక్సులు శూన్యాన్ని కళ్ళుగా
చేసికొని ఖాళీ పొట్టలతో
ఆవురావురంటూ రాలే ఓటు
ఫలాల కోసం ఎదురు చూస్తున్నాయి!
డబ్బై ఏడేళ్ళ స్వేచ్ఛా విహంగం
ఒక్కసారి వెనుతిరిగి చూసుకొంటే
వంకర టింకర అపభ్రంశ ముళ్లబాటల
పయనంలో వెనుకబాటు, గాయాల



ఆనవాళ్లే ఎక్కువ వెక్కిరిస్తున్నాయి..
పాత తప్పిదాలకు పాతరేసే సరైన
సమయమిదే!
బాధ్యతగల రాజకీయాలకు నిస్వార్థప్రజ
ఆకాంక్షలు తోడైతే బ్యాలెట్ బాక్సుల్లో
వెలుగులు చిమ్ముతూ మనం కలలుగనే
నవభారతం తప్పక ఉదయిస్తుంది..!!

**భీమవరపు పురుషోత్తమ్**
9949800253

### ఈసారి మే 13...



నవమాసాల పురిటినొప్పుల
ఆవేదనను దిగమింగి మనకు
ప్రాణం పోస్తుంది మన అమ్మ.
ఐదేళ్లకోసారి..
వరుసలో కాసేపు నిలబడి
మన ఐక్యతను నిలబెట్టి
మన ఓటుతో దేశ
ప్రగతికి ప్రాణం పోయాలి.
నీ ఓటే ఈ దేశానికి
ప్రాణం పోసే అమ్మ.

డెబ్బై ఐదు సంవత్సరాల
స్వాతంత్ర్య అతిపెద్ద
లౌకిక ప్రజాస్వామ్య
దేశంలో
అసమానతల మంటలు
ఇంకా ఆరలేదు.
విద్యా వికిరణాలు
అందరినీ తాకటం లేదు.
వైద్యపు ఫలాలు
పేదోడి ప్రాణాలకు
ప్రాణంపోయటం లేదు.
ఎన్ని సమస్యలున్నా..

ఎంతో ఎత్తుకు ఎదిగాం.
ఎంతోదూరం ప్రయాణించాం.
ఇది చరిత్ర కాదనలేని సత్యం.
కానీ సుదీర్ఘ ప్రయాణం
ఇంకా మిగిలే వుంది..!
పేదరికంతో రణం
కొనసాగుతూనే వుంది..!!

మనకి రాజకీయాల గొడవలొద్దు.
పార్టీల రాద్ధాంతాల రాతలొద్దు.
సేవకులైన నాయకులు కావాలి.
ప్రజల్ని గెలిపించే పార్టీలు
కావాలి.
ఏదేమైనా మన ప్రజాస్వామ్యం
నిటారుగా నిలబడి ప్రపంచానికి
దిక్సూచిగా వుండాలి.
మళ్ళీ ఎన్నికలు
వచ్చాయి.
ఎన్నో ఉచిత కళలు
తెచ్చాయి.
మాయా ప్రపంచపు
కుల, మత
రెయిన్ బో రంగులద్దాయి.
ఈసారి మే
పదమూడు..
సెలవు దినం కాదిది.
నీ భవిష్యత్తుకు
దిశానిర్దేశం ఇది.
పల్లెలు ప్రభావవంతంగానే
కదిలాయి.
పట్నాలే ఎలక్షన్ పట్టాలు తప్పాయి.
రండి..కలుద్దాం
పోలింగ్ స్టేషన్లలో..!
ప్రలోభాలకు లొంగకుండా
బాధ్యతగా, లౌక్యంతో ఓటేద్దాం.
మన దేశాన్ని గెలిపిద్దాం..
నీ చేతి వ్రేలి ఇంకు గుర్తుతో..!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
9394749536

### ఆలోచనా ధోరణులు

కడలి అలలవోలె
అనంతమై నిరంతరం కొనసాగే
మనిషి ఆలోచనలు
మనసులో పురుడు పోసుకునే జ్ఞాపకాలు!
మనిషి మనుగడకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు!!

ఆలోచనలు నిరంతర ప్రవాహ స్రోతస్వినులు
అవి అదిమి పట్టలేని, అరికట్టలేని
నిర్విరామ, నిరాఘాట
అసంకల్పిత చర్యలు!

ఆలోచనలు మనసు చేసే ప్రయాణ దృశ్యాలు
అవి తలంపులై, స్మృతులై
అంతర్లీన భావోద్వేగాలకు ముఖ్యకారకాలై
స్పందనలు సంఘర్షణలకు జీవనమౌల్యాలై
మనసుని పురికొల్పుతుంటాయ్!
కర్తవ్యా కర్మల నిర్వహణకు నాంది ప్రస్తావనలై
లక్ష్య సాధనకు ఆలంబనలై
జీవన గమ్యాన్ని నిర్దేశిస్తుంటాయ్!
భిన్నభిన్నఅభిరుచుల్లా
భిన్న ప్రవృత్తుల మనిషికి
విభిన్న ఆలోచనా ధోరణులు..

సవ్యమైన ఆలోచనలు
కుసుమించిన పుష్ప పరిమళాల్లా
మనసుని రంజింపజేసి
అనిర్వచనీయమైన అనుభూతులనందిస్తాయ్!
వక్రమైన ఆలోచనలు
మనసుని కలుషితపరచి
క్షణం క్షణం కలవరపెడుతూ
ప్రతికూల భావోద్వేగాలను కలిగిస్తాయ్!

మనిషి.....
స్థిరమైన చిత్తంతో, దృఢమైన సంకల్పంతో
అనంత ఆలోచనల వలయంలో
కూరుకుపోకుండా తీరైన రీతిలో స్పందిస్తే
విస్తరించిన పూల పందిరిలా
జీవితం నందనవనమే..!
ఆరాట పోరాటాలతో
సాధ్యంకాని, యోగ్యంలేని
ఆలోచనల తృష్ణవెంట పరుగెడితే
ఎడారిలో ఒయాసిస్సులా
జీవితం నిరాశామయమే..!!

**పి.వి.ప్రసాద్**
9440176824

### ప్రశ్నార్థకమే!



పలుగు పార చేతపట్టి
కండువా తలకు చుట్టి
విత్తనాల ముట్ట నెత్తినెట్టి
అరక వెంటే అడుగులేస్తుంటే
మా అయ్యలో రాజసం ఉట్టిపడేది.

భూమిని చదునుచేసి
మడి నిండా నీళ్ళునింపి
దమ్ము చేసి..గట్లు చెక్కి...
విత్తనాలు చల్లి
మొలకలు కోసం ఎదురుచూస్తున్న
మా అయ్యలో నూతనోత్సాహం

నింగి నుండి జాలువారే చినుకులు
ఏపుగా పెరిగింది పంట
కోతకొచ్చిన పంటను చూసి
తన శ్రమను మర్చిపోయే మా అయ్యా.
పంట పట్నంలో అమ్మగా
తాలు తారక పోను తూకం తేడాలతో
అయ్య చేతిలోకి చేరింది
పెట్టుబడి కూడా రాని పంట మూలధనం.

కాలం గతించింది.
పంట భూములు నేడు బీడు భూములు
చినుకు ముఖం చాటేసింది
ఉన్న భూమి అప్పులతో చేజారింది
మా జీవితంలో మార్పు చోటుచేసుకుంది

పొద్దుగాలనే పలుగు పార పట్టుకుని
పొలానికి బయల్దేరుతుండు అయ్య
రైతే రాజు అనే సమాజంలో
'కూలి'గా మారినందుకు
కాలం కాటు వేసిందో !
మనిషిని మనిషి కాటేసిండో.... ప్రశ్నార్థకమే.

**రాము కోలా**
9849001201

## ఓటింగ్ శాతం పెంచేందుకు ఆదర్శ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

**ప్రజా పక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ శాతం పెంచేందుకు 48 ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి సెగ్మెంట్‌లో 5 ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రాలు, ఒక ఆదర్శ వికలాంగుల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోని ఓటు శాతం పెంచాలని కోరారు.

## దివ్యాంగులు, వయోవృద్ధులకు ఆటోల ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎన్నికల ప్రాసెస్ చాలా సిస్టమెటిక్‌గా స్మూత్‌గా జరిగిందని, చాలా హ్యాపీగా ఉందని జిల్లా కలెక్టర్ సత్పతి పేర్కొన్నారు. సోమవారం పోలింగ్ ప్రక్రియ బాగా జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆదివారం రాత్రి రామడుగు మండలం వెలిచాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆదర్శ మహిళ పోలింగ్ స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా పోలింగ్ స్టేషన్‌లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా వెదిర గ్రామంలో దివ్యాంగుల మోడల్ పోలింగ్ స్టేషన్‌ను వారు పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్దులు, గర్భిణీలు ఇబ్బందులు పడకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ బూత్‌ల వారీగా ఆటోలను ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిపై గ్రామాల్లో సిబ్బందికి విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్దులు, గర్భిణీలు ఇబ్బందులు పడకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ బూతుల వారీగా ఆటోలను ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిపై గ్రామాల్లో సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. సిబ్బంది పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తయ్యేలా కృషి చేయాలని తెలిపారు. మహిళా మోడల్ పోలింగ్ స్టేషన్‌లో మొదట ఓటు హక్కు వినియోగించుకున్న యాభై మంది మహిళలకు పూలు పండ్ల మొక్కలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎంపిడివో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరగాలి

### జిల్లా ఎస్‌పి చందనా దీప్తి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి ఈ నెల 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుగుటకు ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు అని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. నల్లగొండ పట్టణ కేంద్రంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో ఈవియం పంపిణీ సెంటర్ నందు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పార మిలటరీ బలగాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతం వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుటకు ప్రతి ఒక్క పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సరిచూసుకోవాలని, ఓటర్లు క్యూలైన్లు పాటించే విధంగా, పోలింగ్ కేంద్రాల్లోకి ఎలాంటి మండే పదార్థాలు ఇతర రసాయనాలు తీసుకెళ్ళకుండ జాగ్రత్తగా తనిఖీ చేయాలని, 100 మీటర్ల పరిధిలోకి ఎవ్వరూ రాకుండా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. చెక్ పోస్ట్ ల వద్ద విధులు నిర్వహించే వారు, ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గల గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని,పలు జాగ్రత్తలు సూచించారు. పోలింగ్ పూర్తయ్యాక సాయంత్రం ఈవియంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాల వదిలి వెళ్లరాదని అన్నారు.

### శాంతి భద్రతల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకావాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఐదుగురు కంటే ఎక్కువ తిరగరాదని అన్నారు.ఓటర్లను ప్రలోభ పెట్టే డబ్బు,మద్యం ఇతర సంబంధిత వస్తువులు ఎవరైనా పంచితే వెంటనే సి విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయడం కాని డయల్ 100కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## పోలింగ్ శాతం నివేదికలు ఎప్పటికప్పుడు అందించాలి

### కలెక్టర్ హనుమంతు కె.జెండగే

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** నేడు జరిగే పోలింగ్ సందర్బంగా ఓటరు టర్నవుట్ నివేదికలు సకాలంలో అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కే.జండగే అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో సమావేశమై నేడు జరిగే పోలింగ్ సందర్భంగా భువనగిరి పారమ్లెంట్ నియోజకవర్గం సంబంధించి 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన పోలింగ్ సరళి రిపోర్టులు, ఓటర్ టర్నవుట్ రిపోర్టులు, ఇవిఎం రీప్లేస్మెంట్ రిపోర్టులు, అబ్జర్వర్ టీమ్ రిపోర్టులను సకాలంలో నేకరించాలని, ఓటింగ్, పర్సంటేజ్ తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టరు పి.బెన్ షాలోమ్, నోడల్ అధికారులు వెంకటేశ్వర్లు, సునంద, సాహితి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు నాగేశ్వరాచారి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కేంద్రం వద్ద పటిష్ట బందోస్తు



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పార్లమెంట్ ఎన్నికల్లో మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గం పరిధిలో సుమారు 400 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఎనినకల పటిష్ట బందోస్తు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్(డీటీసీ) పి.రమేష్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభ్వు జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల సామాగ్రి పంపిణి స్వీకరణ కేంద్రంలో విధులకు వెళ్లే పోలీసు అధికారులు, సిబ్బంది సమావేశంలో మార్గనిర్దేశం చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాలకు 8 మంది సీఐలు, 18 మంది ఎస్ఐలు, మిగిలిన ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 60 మంది అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఐఆర్బీటీ, 30 మంది ఐటీబీపీ, 25 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సాయుధ దళాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, నిస్పక్షపాతంగా పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ అనుమతించవద్దని, 144 సెక్షన్ నిషేధాజ్ఞలు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. కేంద్రం నుంచి జనాలు వంద మీటర్ల దూరంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్, టూటౌన్, రూరల్ సీఐలు సుధాకర్, పి.నాగార్జున, వీరబాబు, ఎస్ఐలు ఉన్నారు.

# కరీంనగర్‌లో 2194 పోలింగ్ కేంద్రాలు

### 10,200 సిబ్బంది, 2500 పోలీసు సిబ్బందితో బందోబస్తు

### డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికలకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 2194 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలన్నింటికీ ఆదివారం సాయంత్రం పోలింగ్ అధికారులు, సిబ్బంది ఈవీఎంలను తీసుకెళ్లారు. పోలీసు భద్రత మధ్య ఈవీఎంలు పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ మేరకు సిబ్బంది పోలింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. మరికొద్ది గంటల్లో పోలింగ్ స్టార్ట్ కానుంది. 13వ తేదీ ఉదయం 6 గంటల వరకే సిబ్బంది మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. 2500 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నది. పార్లమెంటు పరిధిలో 17 లక్షల 97 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 8 లక్షల 77, 483 మంది, మహిళలు 9 లక్షల 19,565 మంది ఉన్నారు. 102 మంది ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్దులు 13218 మంది, దివ్యాంగులు 41573 మంది ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ స్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో వీల్‌చైర్ ఏర్పాటు చేయనున్నారు. తాగునీరు, నీడ వసతి కూలర్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఎన్నికల్లో 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న దృష్ట్యా ఒక్కొక్క పోలింగ్ కేంద్రాల్లో రెండేసి బ్యాలెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేశారు. మొత్తం 10,200 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. మొత్తం బ్యాలెట్ యూనిట్స్ 5500, కంట్రోల్ యూనిట్స్ 2743, వీవీ ప్యాట్స్ 3077 ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఐదు మోడల్ పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈవీఎంలను అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గట్టి బందోబస్తు మధ్య జిపిఎస్ అనుసంధానం చేసిన వాహనాల్లో వెళ్లి పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సంధర్భంగా సిబ్బందికి జాగ్రత్తలపై సూచనలు చేశారు. పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి - కలెక్టర్**

18 సంవత్సరాలు దాటిన వారందరూ పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కును




తప్పకుండా వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని పేర్కొన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఈ సారి ప్రత్యేకంగా దృష్టి సారించామని, ప్రజలు ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. ఎవరూ మిస్ కావద్దన్నారు.

## నల్లగొండలో 17.25 లక్షల ఓటర్లు

### 2061 పోలింగ్ కేంద్రాలు

### 22 మంది అభ్యర్థులు

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ పార్లమెంటు పోరుకు సై.. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు జరుగనున్న పోలింగ్‌కు కావాల్సిన సామాగ్రితో పాటు సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు 22 మంది బరిలో నిలుచున్నారు. పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేపట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో 17,25,465 మంది ఓటర్లు ఉండగా అందులో 8,44,843 మంది పురుషులు, 8,80,453 మంది స్త్రీలతో పాటు 169 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు కలిగివున్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,49,411 మంది ఓటర్లలో 1,21,303 మంది పురుషులు, 1,28,052 మంది స్త్రీలు, 56 మంది ట్రాన్స్‌జెండర్స్, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,62,480 మంది ఓటర్లలో 1,31,838 మంది పురుషులు, 1,20,624 మంది స్త్రీలు, 18 మంది ట్రాన్స్ జెండర్స్, నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,36,484 మంది ఓటర్లలో 1,15,852 మంది పురుషులు, 1,20,611 మంది స్త్రీలు, 21 మంది ట్రాన్స్ జెండర్స్, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,36,343 మంది ఓటర్లలో 1,15,773 మంది పురుషులు, 1,20,544 మంది స్త్రీలు, 26 మంది ట్రాన్స్‌జెండర్స్, హుజూర్ నగర్ నియోజకవర్గంలో 2,51,444 మంది ఓటర్లలో 1,21,956 మంది పురుషులు, 1,29,471 మంది స్త్రీలు, 17 మంది ట్రాన్స్ జెండర్స్, కోదాడలో మొత్తం 2,45,187 మంది ఓటర్లలో 1,19,172 మంది పురుషులు, 1,25,997 మంది స్త్రీలు, 18 మంది ట్రాన్స్‌జెండర్స్, సూర్యాపేట నియోజకవర్గంలో మొత్తం 2,44,116 మంది ఓటర్లలో 1,18,949 మంది పురుషులు, 1,25,154 మంది స్త్రీలు, 13 మంది ట్రాన్స్ జెండర్స్ ఓటర్లు కలిగివున్నారు. అందులో 18 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల నూతన ఓటర్లు 61,143 మంది, 85 సంవత్సరాలకు పైబడినవారు 9,592, పిడబ్లుడి ఓటర్లు 33,890 మంది ఉన్నారు. వీరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు 2,061 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 365 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. దేవరకొండలో 63, నాగార్జున సాగర్‌లో 46, మిర్యాలగూడలో 51, హుజూర్ నగర్‌లో 51, కోదాడలో 49, సూర్యాపేటలో 60, నల్లగొండలో 45 లను గుర్తించి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు ఇప్పటికే భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను విధించారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామాగ్రి



**ప్రజా పక్షం/సూర్యాపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేడు జరగనుంది. దీని కోసం కావాల్సిన అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఆదివారం ఎన్నికల సామాగ్రిని పోలింగ్ అధికారులకు పంపిణీ చేశారు. సామాగ్రితో సంబంధిత అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా 10,000,12 మంది ఓటర్లు ఉండగా 1201 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా 229 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయట 458 సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పరిశీలించనున్నట్లు చెప్పారు. 112 రూట్లలో 123 సెక్టార్ అధికారులు, 5600 మంది పోలింగ్ అధికారులు అలాగే 173 మంది మైక్రోఅబ్జర్వర్లు, 729 మంది వాలింటర్లు నియమించినట్లు తెలిపారు. అంగవైక్యం ఉన్న వారు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 729 ఆటోలను సిద్ధం చేసినట్లు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. యువత ఓటర్లు ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని చైతన్యపరిచేలా ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుండి ముమ్మరంగా ప్రచారం చేశారు. ఉదయం 7 గంటల నుండి 6 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ లోపు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలైన్లో నిలిచిన వారందరికి ఓటు హక్కు అవకాశం కల్పించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కును వాడుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

**ఎన్నికల పోలింగ్ నిర్వహణ సజావుగా నిర్వహించాలి**

ఎన్నికల పోలింగ్ నిర్వహణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట అసెంబ్లీ సెగ్మెంట్ పంపిణీ కేంద్రం, కోదాడలోని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను సాదారణ పరిశీలకులు మనోజ్ కుమార్, మణిమాణిక్యరావు, సూర్య వంశీ, ఎస్‌పి రాహుల హెగ్డేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ నిర్వహణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఐదుగురు పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సి విజిల్ ద్వారా 69 ఫిర్యాదులు అందగా వాటిలో 53 పరిష్కరించామని, 16 ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఎస్‌పి రవి, తహసీల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి, క్రిష్ణయ్య, మహేందర్ రెడ్డి, వినోద్ కుమార్,ఆర్‌టిసి అధికారి ఏకాంబరం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ శాతం తగ్గే అవకాశం

### నిరాశ పర్చిన ఓటరు తాయిలం

### గతంతో పోల్చుకుని అసహనం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాజకీయ పార్టీలు ఓట్లు పొందెందుకు ఓటర్లకు ఇచ్చే తాయిలాలపై ఖమ్మం పార్లమెంటు పరిధిలో తీవ్ర చర్చ సాగుతుంది. శాసన సభ ఎన్నికలతో పోల్చుకుని ఓటర్లు ఒక్కింత ఆగ్రహాన్ని మరో పక్క అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత శాసన సభ ఎన్నికల సందర్భంగా పార్లమెంటు పరిధిలో ఏడు నియోజక వర్గాలు ఉండగా ప్రతి నియోజక వర్గంలోను ఓటరుకు రూ. 1000 నుంచి రూ. 5వేల వరకు ఇచ్చి ఓట్లు అభ్యర్థించారు. ఒక ట్రెండు నియోజక వర్గాల్లోనే కాస్త తక్కువ పంపిణీ జరగగా మిగిలిన నియోజక వర్గాల్లో ప్రధాన పార్టీలో పోటా పోటీగా నజరానాలు అందజేశాయి. పోలింగ్‌కు వారం ముందు నుంచే ఓటర్లను ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాలను సంతృప్తిపరిచేందుకు ప్రయత్నం చేశాయి. డబ్బు పంపిణీ విషయంలో శాసన సభ ఎన్నికల సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీలు వెనకడుగు వేయలేదంటే అతిశయోక్తి కాదు. కానీ పార్లమెంటు ఎన్నికల నాటికి పరిస్థితి తారుమారైంది. అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ కానీ విపక్షంలో ఉన్న బిఆర్ఎస్ కానీ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు డబ్బు పంపిణీ చేసేందుకు ముందుకు రాలేదు. ఓ అభ్యర్థి రూ. 500ల చొప్పున పంపిణీ చేస్తే మరో ప్రధాన పార్టీ అభ్యర్థి అక్కడక్కడ పలు రకాలుగా పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రూ. 500, రూ. 400, రూ. 300ల చొప్పున పంపిణీ చేశారు. అది కూడా అన్ని నియోజక వర్గాల్లోను పూర్తి స్థాయిలో చేరలేదని సమాచారం. ఖమ్మం శాసన సభ నియోజక వర్గానికి సంబంధించి రెండు ప్రధాన పార్టీలు కూడా పంపిణీ విషయంపై దృష్టి సారించ లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. డబ్బు కోసమే ఓటు వేస్తారా అన్నది పక్కన పెడితే తాయిలాల పంపిణీ పై పోలింగ్ పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఖమ్మం బరిలో 35 మంది అభ్యర్థులు

### మొత్తం 16,31,039 మంది ఓటర్లు

### 1,896 పోలింగ్ కేంద్రాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** 18వ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సోమవారం జరగ నుండగా పోలింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ నేతృత్వంలో పోలింగ్‌కు ఎటువంటి ఆటంకం కలుగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఖమ్మంపార్లమెంటు పరిధిలో ఏడు శాసన సభ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందు కొరకు మొత్తం 1082 ఆవాసాలలో 1,896 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం నియోజక వర్గంలో అత్యధికంగా 355 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించి 3,24,073 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పాలేరు నియోజక వర్గంలో 290 పోలింగ్ బూత్‌లను 190 ఆవాసాలలో ఏర్పాటు చేయగా మొత్తం 2,40,806 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మధిర నియోజక వర్గంలో 152 ఆవాసాలకు గాను 268 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా 2,22,160 ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వైరాలో 252 పోలింగ్ బూత్‌లను 181 ఆవాసాలలో ఏర్పాటు చేయగా 1,93,389 ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సత్తుపల్లి నియోజక వర్గంలో 164 ఆవాసాలకు గాను 294 బూత్‌లను ఏర్పాటుచేయగా ఈ బూత్ ల ద్వారా 2,43,943 ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కొత్తగూడెం నియోజక వర్గంలో 253 పోలింగ్ బూత్‌లను 137 ఆవాసాలలో ఏర్పాటు చేయగా 2,47,494 మంది ఓటు హక్కును వినియోగించుకోనుండగా అశ్వారావుపేటలో 124 ఆవాసాలలో 184 పోలింగ్ బూత్‌లలో 1,59,174 ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలో ఏడు శాసన సభ నియోజక వర్గాల్లోను మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం విశేషం. మొత్తం 7,87.160 మంది పురుష ఓటర్లు ఉండగా 8,43,749 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలో 130 మంది ట్రాన్స్‌జెండర్లు, 228 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, 913 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 19 సంవత్సరాల ఓటర్లు 50,747 మంది ఉండగా ఇందులో యువకులు 26,775 మంది, యువతులు 23,967 మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఓటు హక్కు కలిగి ఉన్నారు. యువ ఓటర్ల సంఖ్యలో ఖమ్మం అగ్ర స్థానంలో ఉంది. ఇందుకు సంబంధించి పోలింగ్ సామాగ్రిని పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సంబంధిత సిబ్బందికి సామాగ్రిని అందించి ఎటువంటి రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి రూటులో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144వ సెక్షన్‌న విధించడంతో పాటు అత్యంత భద్రతా ఏర్పాట్లు చేశారు. ఖమ్మంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ద్వారా ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని తరలించారు. వైరాలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుండి, సత్తుపల్లిలో జ్యోతి నిలయం పాఠశాల నుండి, మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని తరలించారు. అశ్వారావుపేట పరిధిలోని పోలింగ్ బూత్‌లకు వ్యవసాయ కళాశాల నుంచి, కొత్తగూడెంలోని రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని తరలించారు. కలెక్టర్, రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులు పోలింగ్ సామాగ్రి పంపిణీని దగ్గరుండి పర్యవేక్షించారు. అధికారులు ఏర్పాట్లు చేసిన రూట్ల ద్వారా ప్రత్యేక వాహనాలను, వాటికి రక్షణగా పోలీస్ ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశారు.

**ఆరు గంటల వరకు పోలింగ్ :**

ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా శాసన సభ నియోజక వర్గాల పరిధిలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజక వర్గాల్లో మాత్రం సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్ కొనసాగుతుందని ఓటర్లు దీనిని గమనించాలన్నారు. ఈవిఎం యంత్రాలను ముఖ్యంగా రిజర్వు ఇవిఎం యంత్రాలను సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉంచాలని పోలింగ్ సిబ్బంది నియమ నిబంధనలను తూచ తప్పక పాటించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సజావుగా నడిచేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. క్యూలైన్ల వద్ద టెంటు ఇతర సౌకర్యాలు కల్పించామని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్‌సురభి, ఎం. రాజేశ్వరి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.

## భువనగిరిలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

### మొత్తం 18,08,585 మంది ఓటర్లు

### 39 మంది అభ్యర్థులు

### 2141 పోలింగ్ కేంద్రాలు



**ప్రజాపక్షం/ఆలేరు :** భువనగిరి పార్లమెంటు ఎన్నికల పోలింగ్ కొరకు ఈసి నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సామాగ్రితో తమకు కేటాయించిన సెంటర్లకు సిబ్బంది చేరుకున్నారు. భువనగిరి లోక్సభ నియోజక వర్గ పరిధిలో 18,08,585 మంది ఓటర్లు ఉండగా 39 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. భువనగిరి పార్లమెంటు పోలింగ్ కోసం 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 2141 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 7 డిఆర్సిల వద్ద ఈవీఎంలు వివి ప్యాటులను అధికారులు స్ట్రాంగ్ రూంలో సిద్ధంగా ఉంచారు. రాండమైజేషన్ ద్వారా ఆయా అసెంబ్లీ నియోజక వర్గం కేంద్రాలకు ఈవీఎంలను తరలించి స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి నేడు పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. 1325 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సీసీ కెమెరాల నిఘా నీడలో పోలింగ్ జరిపేలా ఏర్పాటు చేశారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా 10,140 సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తుండగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారని ఆర్ ఓ గంగాధర్ తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలలో సకల సౌకర్యాలు

### పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

### జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన



**ప్రజాపక్షం/నల్లగొండ :** పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి, నల్లగొండ పార్లమెంటరీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జి కళాశాలలో ఏర్పాటుచేసిన పార్లమెంటు ఎన్నికల పంపిణీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అక్కడ పోలింగ్ సిబ్బంది మెటీరియల్ పంపిణీ, పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను, సిబ్బందికి భోజన, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు.అనంతరం మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లలో పెద్ద ఎత్తున అవగాహన చేపట్టడం జరిగిందని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలలో నీడ, తాగునీరు, టాయిలెట్స్ తోపాటు, మెడికల్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సెక్టోరల్ అధికారులతో పాటు, అంబులెన్స్ లు సైతం ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఆ సౌకర్యాలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని ,జిల్లాలోని ఓటర్లందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం నుండి ఎన్నికల ప్రచారం ముగిసినందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు 85 ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి ,విఎస్‌టి, వివిటి బృందాలు పర్యవేక్షణ చేస్తున్నాయని, ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి విజిల్ ద్వారా ఇప్పటివరకు 180 ఫిర్యాదులు రాగా, వాటన్నిటిని కేవలం 55 నిమిషాల లోపే బృందాలు ఆ ప్రదేశాలకు వెళ్లి పరిష్కరించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కు సర్వం సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ఆర్‌డిఓ రవి రవికుమార్, డిఆర్డిఓ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు

**విధులకు గైర్హాజరైన సిబ్బందిపై కేసులు నమోదు**

పార్లమెంటు ఎన్నికలకు ఇంకా కొన్ని గంటల గడువు మాత్రమే మిగిలి ఉండగా ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు కూడా చేరింది. పోలింగ్ నిర్వహించవల్సిన అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజా ప్రతినిధ్య చట్టం 1951 కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఎన్నికల నిర్వహణ శిక్షణకు అందరు హాజరు కావాలని ఆదేశాలు ఉన్నప్పటికీ శిక్షణ సమయంలో కొంతమంది, ఎన్నికల నిర్వహణలో కొంతమంది గైర్హాజరు కావడంతో ఎన్నికల అధికారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవరకొండ, నాగార్జున సాగర్, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాలలో అత్యధికంగా సిబ్బంది గైర్హాజరు కావడం గమనార్హం.

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి...



ప్రజాపక్షం/బోథ్ : పార్లమెంటు ఎన్నికలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బోథ్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటిడిఏ పిఓ కుష్బు గుప్తా తెలిపారు. బోథ్ నియోజక వర్గంలో మొత్తం 306 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఇందులో మొత్తం 35 రూట్లు ఉన్నాయని ఇందుకోసం 2774 మం ది సిబ్బంది ఉన్నారని తెలిపారు.అలాగే పోలింగ్ సిబ్బంది వారి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు మొత్తం 143 వాహనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదిలావుంటే జిల్లా కలెక్టర్ రాజర్షి షా బోథ్‌కు చేరుకొని బోథ్ నియోజక వర్గంలోని 306 పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేయాల్సిన ఈవిఎం ల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల అధికారులకు పంపిణీ చేయాల్సిన సామాగ్రి అన్ని ఉన్నాయా లేదా అన్న విషయాన్ని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కుష్బు గుప్తా ను అడిగి తెలుసుకున్నారు.

## ఎన్నికల విధులకు ఎన్‌సిసి క్యాడెట్లు



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజు సామాజిక సేవ, స్వచ్ఛం ద ప్రాతిపదికన ఎన్‌సిసి క్యాడెట్లను ఎన్నికల విధులకు వినియోగించు కోవడం జరుగుతుంది అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజి) తెలిపారు. సీపీ ఎన్నికల విధులకు హాజరైన 90 మంది ఎన్‌సిసి క్యాడెట్లకు చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి వారికీ సూచనలు చేయడం జరిగింది. పోలింగ్ బూత్‌లలోకి వెళ్ళకూడదు అని, ఓటర్ లను క్యూ పద్ధతి లో ఉండేలా చూడాలని, అక్కడ విధులలో ఉన్న పోలీస్ సిబ్బంది కి సహాయంగా ఉండాలని, క్రమశిక్షణతో ఉంటూ అందరితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, సిసి అర్బీ ఇన్‌స్పెక్టర్ బి. స్వామి, ఆర్ఐ కె.మధు పాల్గొన్నారు.

## శాత్రాజుపల్లిలో పోలింగ్ కేంద్రం



ప్రజాపక్షం /ముత్తారం : పెద్దపల్లి జిల్లామండలంలోని పారుపల్లి పంచాయతీ పరిధి మానేరు అవతలి ఒడ్డున ఉన్న శాత్రాజుపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఈ సారి ఏర్పాటు చేశారు. శాత్రాజుపల్లి గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అక్కడి గ్రామ తమ ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి సారి 5 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వచ్చి ఓటింగ్ లో పాల్గొనే పరిస్థితులు ఉండేవి. దీంతో ఎన్నికల సమ యంలో ఓటింగ్ లో పాల్గొనేందుకు శాత్రాజుపల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ సమస్యలను దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి ఎన్నికల అధికారులు గ్రామంలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తో గ్రామస్తులకు ఇబ్బందులు తొలగాయి. గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఆ గ్రామ గిరిజన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థికి మంత్రి అభినందనలు



ప్రజాపక్షం/మంథని: ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించి సన్మానించారు. మంథని మండలం మల్లారం గ్రామానికి చెందిన పర్ష సంతోష్‌కుమార్ కోమలత కూతురు మాధురి ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సర పరీక్ష ఫలితాల్లో 440మార్కులకు గాను 434మార్కులు సాధించింది. ఆదివారం మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలువగా ఆమెను అభినందిస్తూ సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన మాధురి పట్టుదలో చదువుకుని మంచి మార్కులు సాధించడం గొప్ప విషయమని, రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి తోడ్పాటునందించాలని మంత్రి సూచించారు.

## 36 మోడల్ పోలింగ్ కేంద్రాలు




ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల నేఫథ్యంలో జగిత్యాల జిల్లాలో 36 మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని మూడు శాసన సభ నియోజకవర్గంలో 15 మహిళా పోలింగ్ కేంద్రాలను, మూడు దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలను, మూడు యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## విరంచి స్వాప్నికకు మరో మెడల్



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి విరించిస్వాప్నిక మరో అంతర్జాతీయ పతకం సాధించింది. హాంకాంగ్‌లో జరుగుతున్న ఆసియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ కాంపిటీషన్‌లో శనివారం జరిగిన పోటీల్లోరజత పతకం కైవసం చేసుకుంది. విరించిస్వాప్నికగతంలో షార్జాలో జరిగిన ఆసియా యూనివర్సిటి చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొని అంతర్జాతీయ క్రీడాకారిణిలతో పోటీ పడి పలు విభాగాల్లో బంగారు పతకాలు కైవసం చేసుకుంది. పోటీ పడిన ప్రతి వేదికపై విజయ కేతనం ఎగురవేస్తున్న విరించి స్వాప్నికను, ఆమె తల్లిదండ్రులు రంగు వెంకటరమణ శ్రీలతలను, కోచ్ రాజేందర్‌లను పట్టణ వాసులు అభినందిస్తున్నారు.

## ఓటు హక్కు.. వజ్రాయుధం

ప్రజాపక్షం/నాంపల్లి: నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్దమైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 303 పోలింగ్‌బూత్‌లో 949 ఓట్లు, 304బూత్‌లో 1226 ఓట్లు, 305 బూత్‌లో 1123ఓట్లు ఉన్నట్లు ప్రిసెండింగ్ అధికారి సిహెచ్. బిక్షమయ్య తెలిపారు. ఉదయం 7 గంటల నుండి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు.

# పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకూ అప్రమత్తత

వాహనాలకు జిపిఎస్ అనుసంధానం

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను భద్రంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఆదివారం కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాలకు సంబంధించి, మానకొండూర్‌కు సంబంధించిన కరీంనగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అలాగే హుజురాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌ను పర్యవేక్షించారు. ఈ సంధర్భంగా వారు కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలర్లు, విద్యుత్తు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ తీసుకుని అప్రమత్తంగా వెళ్లాలని సూచించారు. అదేవిధంగా మెటీరియల్ అంతా ఉన్నదా లేదా అని సరిచూసుకోవాలని తెలిపారు. అన్ని సక్రమంగా చూసుకోవాలని, ఏదీ మర్చిపోవద్దని సూచించారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పనిచేయాలని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వవద్దని, సమస్యలు ఏమైనా ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జిపిఎస్ అనుసంధానం చేశామని, పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేవిధంగా జాగ్రత్తగా కరీంనగర్‌లోని స్ట్రాంగ్ రూంలకు తరలించాలని పేర్కొన్నారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. అలాగే ఈవీఎంలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్‌కు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో మానకొండూర్ నియోజకవర్గ ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్‌తో పాటు కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు అమిత్ కటారియా, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో సమన్వయం తప్పనిసరి

పోలింగ్ సామాగ్రితో కేంద్రాలకు

చేరిన ఉద్యోగులు

పర్యవేక్షించిన జగిత్యాల జిల్లా కలెక్టర్

షేక్ యాస్మిన్‌బాషా



ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సామాగ్రి, ఓటింగ్ యంత్రాల పంపిణీ ప్రక్రియ మొదలైంది. ఇందుకుగాను జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా నేతృత్వంలో సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం సోమవారం నాటి పోలింగ్ ప్రక్రియకు ముందు రోజు ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. మద్యాహ్నం నుండి పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. జగిత్యాల నియోజకవర్గానికి జగిత్యాల మినీ స్టేడియంలో, ధర్మపురి నియోజకవర్గానికి జగిత్యాల జూనియర్ కళాశాలలో, కోరుట్ల నియోజకవర్గానికి కోరుట్ల ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటింగ్ యంత్రాలు, సిబ్బందిని తరలించేందుకు 295 వాహనాలు సిద్ధం చేశారు. అందులో సెక్టార్ అధికారులకు 80 కార్లు, పోలింగ్ సిబ్బంది తరలించేందుకు 85 బస్సులు, 139 మిని బస్సులు, 22 ఇతర వాహనాలు ఉన్నాయి. పోలింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలు తరలించేందుకు 7 కంటైనర్లను సిద్దంగా ఉంచారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో 1104 మంది పోలింగ్ అధికారులు, 1104 సహాయ పోలింగ్ అధికారులు, 2208 మంది ఇతర సిబ్బంది, 116 మంది మైక్రో అబ్జర్వర్లు పాల్గొంటున్నారు. నియోజకవర్గాల వారీగా కోరుట్లలో 1261, జగిత్యాలలో 1227, ధర్మపురి1014,చొప్పదండి పంపిణీ నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో 517 మంది, వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో 431 మంది అధికారులు, ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ధర్మపురి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ టిఎస్ దివాకర, జగిత్యాల కేంద్రంలో ఆర్డీవో పి. మధుసూధన్, కోరుట్ల నియోజకవర్గంలో ఆర్డీవో ఆనంద్ కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా జగిత్యాల పంపిణీ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సిబ్బంది కలిసి తరలివెళ్లే వాహనాలను పర్యవేక్షణ చేశారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఉన్నత శిఖరాలకు ఎదగాలి



ప్రజాపక్షం/చిగురుమామిడి: చిగురుమామిడి మండలం గునుకులపల్లి గ్రామానికి చెందిన కొమ్మెర రిషిత రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివి 10 జిపిఏ సాధించినందుకు గాను లక్ష్మి చారిటబుల్ ట్రస్టు, ఇందుర్తి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం లక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ్ రెడ్డి , రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది రాజశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ నిరుపేద రెడ్డి కుటుంబానికి చెందిన కొమ్మెర రిజిత పదిలో అద్వితీయ ప్రతిభ కనబరిచిందని అభినందించారు. భవిష్యత్తులో మరెంతో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. వారి తండ్రి కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. బాసర త్రిబుల్ ఐటీలో సైతం సీటు సాధించాలని ఆకాంక్షించారు. రెడ్డి సంఘం నాయకులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, ముచ్చంతల వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పోతరవేని లింగం, కూన సంతోష్, చెప్పాయల మురళీ కత్తి స్వామి, భరత్ యాదయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

## ముత్తారం'లో 22,889 మంది ఓటర్లు



ప్రజాపక్షం/ ముత్తారం : నేడు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాముత్తారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఓటింగ్ ప్రక్రియకు వినియోగించే పరికరాలతో ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో రామగిరి జెఎన్టియులో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించి ఈవిఎం మిషన్లతో ఆదివారం సాయం త్రం వరకు ముత్తారం మండలంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎంపిడిఓ లలిత, ఎంపిఓ బైరి వేణుమాధవ్ స్వాగతం పలికారు. ముత్తారం మండలంలో మొత్తం 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశా రు. 22,889 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 11,194, స్త్రీలు 11694 మంది, ట్రాన్స్ జెండర్ ఒక ఓటర్ ఉన్నారు. కాగా వీరు నేడు జరిగే పోలింగ్ లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఇబ్బందులకు గురి కాకుండా ఎన్నికల అధికారులు సౌకర్యాలను కల్పించగా, ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎంపిడిఓ,ఎం పిఓలు ఓటర్లను కోరారు.

## పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

కలెక్టర్, ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : లోక్ సభ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సూచించారు.ఆదివారం రామగిరి మండలంలోని మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, రామగుండంలోని ఎన్టిపిసి టిటిఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని,ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వ్ పోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మీడియాతో మాట్లాడుతూ రామగుండం అసెంబ్లీ సెగ్మెంటులో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందజేసే కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగిందని, రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 260 పోలింగ్ కేంద్రాలలో సజావుగా పోలింగ్ జరిగేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న 1850 పోలింగ్ కేంద్రాల వద్ద మే 13న పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. సహాయ రిటర్నింగ్ అధికారులు జే.అరుణ శ్రీ, హనుమా నాయక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 'ధర్మపురి'లో 269 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికల సిబ్బందికి ఇవిఎం అప్పగింత

సర్వత్రా అప్రమత్తత



ఇవిఎంలతో.. విధులకు

ప్రజాపక్షం / ధర్మపురి : ధర్మపురి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో నేడు నిర్వహించనున్న పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల కోసం నిర్వహించనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని ధర్మపురి, ధర్మారం, ఎండపెల్లి, వెల్గటూర్, పెగడపల్లి, గొల్లపల్లి, బుగ్గారం మండలాల్లో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. నేడు జరగనున్న పోలింగ్ కోసం ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి ఈవిఎంలను అప్పగించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం 2,30,786 మంది ఓటర్లుండగా వారిలో 1,14,639 పురుషులు కాగా,, 1,16,047 మంది స్త్రీలు, 6గురు థర్డ్ జెండర్లు ఉన్నారు. ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ సిబ్బందికి ఈవిఎంలు, ఫారాలను అప్పగించారు. నియోజకవర్గంలోని 7మండలాల్లో మొత్తం 269 పోలింగ్ కేంద్రాలలో 79 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. మొత్తం 1155 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. వారిలో 269 ప్రిసైడింగ్ అధికారులు, 269 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు కాగా మిగిలిన వారు ఇతర సిబ్బందిని ఏర్పాటు చేశారు. 269 పోలింగ్ కేంద్రాలకు వెళ్లుటకు 26 రూట్లను ఎంపిక చేసి 21 మంది మైక్రో పరిశీలకులు, 300 మంది పోలీస్ ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సిబ్బందికి ఈవిఎంలను అప్పగించి వారి వారి గమ్య స్థానాలకు ప్రత్యేక బస్సుల ద్వారా పంపించారు. కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల పరిశీలకులు రావిస్ గుప్తా పరిశీలించారు.

## పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: నేడు నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు మండల వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ అనురాధ తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 34 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేశామని అన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ప్రతి ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసి, కేంద్ర పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

## ఓటర్ల పట్ల మర్యాద పాటించాలి

పోలీసులకు సిపి అభిషేక్ మొహంతి సూచన




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేయబడిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆదివారం సందర్శించారు. అక్కడ ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు వచ్చిన పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల రోజు నిర్వహించు విధులపై కమిషనర్ పలు కీలక సూచనలు చేశారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామాగ్రిని , ఈవీఎంలను స్వీకరించిన తర్వాత వాటికి భద్రతగా వారితో పాటు కేటాయించబడిన పోలింగ్ లొకేషన్, కేంద్రాన్ని తెలుసుకుని వారి వెంటనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్ణయించబడినప్పటికీ పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకే విధులకు హాజరై సంసిద్దంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లను క్యూపద్ధతిలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతో పాటు అన్ని వర్గాల ప్రజలతో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి వాటిని నివారించేందుకు రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయించామని, ఆయా అధికారుల ఫోన్ నెంబర్లను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని, సమస్యలు తలెత్తితే వెంటనే వారికి తెలపాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లరాదని, వారు పిలిస్తేనే వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.

## ఎన్నికల పంపిణీ కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/దేవరకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణి కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బంది హాజరు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లిపోయిన పోలింగ్ బృందాలు, ఇం కా వెళ్లవలసిని టీంలు తదితర అంశాలపై సెక్టోరల్ అధికారులు, జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ విధులకు గైర్హాజరైన సిబ్బందిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ఎన్నికల కేసు నమోదుచేయాలనిదేవరకొండ ఆర్డీవో, స్పెషల్ కలెక్టర్ పార్లమెంట్ డిప్యూటి ఆర్‌వో నటరాజ్‌ను ఆమె ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన బస్సుల కాన్వాయ్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ సౌకర్యాలు ఎలా ఉన్నాయని, భోజనం ఎలా ఉందని అడుగగా, భోజనం సరిగ్గా లేదని కలెక్టర్‌కు తెలిపారు.ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ వంట ఏజెన్సీని మార్చాలని, రిసెప్షన్ నాటికి వేరే భోజనం బాద్యత అప్పగించాలని తన అనుమతి లేనిదే భోజనానికి సంబంధించిన బిల్లులు చెల్లించవద్దని ఆదేశించారు. ఇంచార్జీ డిటివో రాజ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో శ్రీరాములు, తహశీల్దార్ సంతోష్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా తనిఖీలు..భారీగా నగదు పట్టివేత

## మెదక్ జిల్లా మాసాయిపేటలో రూ.88,43 లక్షలు
## ఖమ్మం జిల్లా కూసుమంచిలో రూ.99.94 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు





**ప్రజాపక్షం/వెల్దుర్తి :** మెదక్ జిల్లా మాసాయిపేట మండలం పోతిన్‌పల్లి చౌరస్తా వద్ద శనివారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పెద్ద శివునూర్ గ్రామ శివారులోని ఒక గెస్ట్ హౌస్ నుంచి బయటకు వచ్చిన కారును తనిఖీ చేయగా అందులో రూ.88లక్షల 43వేలను స్వాధీనం చేసుకున్నారు. వివిధ గ్రామాలలో బూత్ వారిగా పంపిణీకి సిద్ధం చేసిన 27 ప్యాకెట్లలో మొత్తం రూ.88లక్షల 43 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రామాయంపేట సిఐ వెంకటేష్ తెలిపారు. పట్టుబడిన డబ్బులు కవర్లలో ప్యాక్ చేసి బూత్‌లవారిగా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచారు. ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన చేగుంట పట్టణానికి చెందిన అన్నం రవి, పుల్లబోయిన రవి అనే ఇద్దరు వ్యక్తులకు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి చెందిన డబ్బుగా అనుమానిస్తున్నారు. సమాచారం ఇచ్చారనే అనుమానంతో బిజెపి నాయకుడిపై దాడి మాసాయిపేట మండలంలో కారులో డబ్బులు పట్టబడడానికి తానే కారణమనే అనుమానంతో చేగుంట బిఆర్ఎస్ జడ్పీటీసీ మొదం శ్రీనివాస్ మరో అనుచరుడితో కలిసి దాడి చేశారంటూ భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు ఆంజనేయులు చేగుంట పోలీస్ స్టేషన్‌లో శనివారం అర్థరాత్రి ఫిర్యాదు చేశాడు.

### కారు బోల్తా పడి బయట పడ్డ డబ్బు

**కూసుమంచి :** ప్రమాదవశాత్తు ఓ కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో రూ.99.94 లక్షల నగదు బయటపడింది. ఈ నగదు విపక్ష అభ్యర్థి పార్లమెంటు ఎన్నికల్లో వినియోగించేందుకు తరలిస్తున్నవిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నుండి బయలుదేరిన టిఎస్04ఈఆర్0555 నెంబరు గల ఇన్నోవా కారు కూసుమంచి వైపుకు వచ్చింది. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆపకుండా తప్పించుకు వచ్చిన కారును పోలీసులు వెంబడించడంతో అతివేగంగా వెళుతూ మండల పరిధిలోని దేవునితండా వద్ద రూటు తప్పించబోయి బోల్తా పడింది. కారును ఐటి అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల సమక్షంలో తనిఖీ చేయగా రూ. 99.94 లక్షలను గుర్తించారు. కారులో ప్రయాణిస్తున్న పాల్వంచ రాజేష్, డ్రైవర్ తిప్పని సైదులుకు గాయాలయ్యాయి. వారిని ప్రశ్నించగా ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వర రావుకు చెందిన నగదుగా గుర్తించారు. దీనిపై కూసుమంచి ఎస్ఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇండియా కూటమితోనే రాజ్యాంగ, లౌకికవాద పరిరక్షణ

### సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇండియా కూటమితోనే రాజ్యాంగ, లౌకికవాద పరిరక్షణ సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రజలను కోరారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ 18వ పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలు అత్యంత కీలకమైనవని, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలుగా చెప్పుకోవచ్చునన్నారు. దేశాన్ని మతం పేర, కులం పేర విభజించాలనుకునే బిజెపి మరో పక్క లౌకికవాద ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన ఇండియా కూటమి బరిలో ఉన్నాయని ప్రజలు ఆలోచించి ఈ దేశంలో ప్రజాస్వామ్యం పరిడవిల్లాలంటే లౌకికవాదం మనుగడ కొనసాగాలంటే ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలన్నారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలో సిపిఐ బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పరిశ్రమ పరిరక్షణకు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

### తాటిపాముల వెంకట్రాములు



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం పార్లమెంట్ ఎన్నికలలో సిపిఐ బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మోడీసర్కార్ బట్టల మిల్లుల అధిపతులకు లాభాలు చేకూర్చేందుకు చేనేత రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసినందున చేనేత మనుగడకే ముప్పు వాటిల్లిందన్నారు. గతంలోఉన్న ఆల్ ఇండియా హైండ్లూమ్ బోర్డ్‌ను, నేతన్నలకు సంక్షేమ పథకాలను రద్దు చేయడం నూలు పట్టు రంగులు రసాయనాలు ముడి సరుకుల పై చేనేత వస్త్రాలపై జిఎస్టి పేరు తో పన్నులు విధించడంతో దేశ వ్యాప్తంగా చేనేతపై ఆధారపడిన కోటికి పైగా కుటుంబాల మనుగడే ప్రశ్నార్థంగా మారిందన్నారు. నేతన్నలు ఉపాధి కోల్పోయి పనులు లేక ఆర్థికంగా చితికిపోయి అనారోగ్యాల పాలై అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డ పాలకులలో స్పందన లేదన్నారు. రూ.45 లక్షల కోట్ల కేంద్ర భారీ బడ్జెట్లో భిక్షం వేసినట్లు కేవలంరూ. 200 కోట్లు మాత్రమే చేనేతకు కేటాయించి చేనేతను నిర్మూలించేందుకే కంకణం కట్టుకొని నేతన్నల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారికి ఈఎన్నికలలోగుణపాఠం తప్పదన్నారు. చేనేతకు చేయూతనందిస్తామని హామీ ఇచ్చిన ఇండియా కూటమి బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలిపించాలని నేతన్నలకు చేనేత శ్రేయోభిలాషులకు ప్రజలందరికి వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల సంఘం ఆదేశాలను ధిక్కరిస్తున్న అధికారులు : ఏఐటియుసి

### డ్రైవర్లు విధులకు రావాలని ఒత్తిడి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మే 13 న ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతి సంస్థ లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు మరియు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోవాలని వేతనం తో కూడిన సెలవు ప్రకటిస్తే, ఓసిపి 5 యాజమాన్యం కన్వేయన్స్ డ్రైవర్ లను విధులకు రావాలని ఒత్తిడి చేస్తున్నారని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్, కార్యదర్శి శనగల శ్రీనివాస్ లు ఆరోపించారు. ఎన్నికల రోజు వేతనం తో కూడిన సెలవు ప్రకటించి అందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం తగు ఆదేశాలు జారీ చేస్తే, అట్టి ఆదేశాల ను ధిక్కరిస్తూ మీరు ఏమన్నా పర్మినెంట్ కార్మికులా, సెలవు ఎందుకు ఇవ్వాలని ఓసిపి 5 అధికారులు కన్వేయన్స్ డ్రైవర్ లను విధులకు రావాలని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ఓసిపి 5 అధికారులు తక్షణమే తమ నిర్ణయాన్ని రద్దు చేసుకొని కన్వేయన్స్ డ్రైవర్లు అందరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, వారికి ఎన్నికల రోజు వేతనం తో కూడిన సెలవు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు, లేనిచో ఓసిపి 5 అధికారుల పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

## ఆదర్శ గ్రామం గంగదేవపల్లిని సందర్శించిన మహీంద్ర యూనివర్సిటీ విద్యార్థులు



**ప్రజాపక్షం/గీసుకొండ:** జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలంలోని గంగదేవపల్లి గ్రామానికి శనివారం హైదరాబాద్ బహదూర్‌పల్లిలోని మహీంద్ర యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. స్టూడెంట్స్ క్లబ్ ప్రెసిడెంట్ నవ్యాన్స్, సెక్రటరీ తోట అశ్వద్‌కుమార్, ప్రగతి, శ్రీజల నాయకత్వంలో బీటెక్, లా, మేనేజ్‌మెంటు చదువుతున్న వారు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గంగదేవిపల్లిలో వివిధ కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రజల భాగస్వామ్యంతో ఇంటింటికి మరుగుదొడ్డి, నల్లా కనెక్షన్లు ప్రతీ సంవత్సరం నవంబరు నెలలోనే గ్రామపంఆచయతీ పన్నుల చెల్లింపులు, 50 ఏళ్ల లోపు వారందరూ అక్షరాస్యత, ఇద్దరు పిల్లలతోనే కుటుంబ నియంత్రణ పాటించడం తదితర అనేక విషయాలను సాధించుకోవడం వల్ల 2012 నుంచి నేటి వరకు 6వ తరగతి సోషల్‌లో గంగదేవిపల్లి గ్రామాభివృద్ధిని పాఠ్యాంశంగా చేర్చడం జరిగిందన్నారు. బాలవికాస సంస్థతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో 26 అవార్డులు, వీటితో పాటు నగదు పారితోషికం రూ. 11.48 లక్షలు వచ్చినట్లు జిల్లా ట్రైనింగ్ మేనేజర్స్ కూసం రాజమౌళి, వనపర్తి కరుణాకర్‌లు విద్యార్థులకు వివరించారు. గ్రామస్థులు సాధించిన అనేక అభివృద్ధి అంశాలను తెలుసుకొని గ్రామస్థులను విశ్వాసంతో ఐక్యపర్చి నడిపినందుకు నాయకత్వాన్ని విద్యార్థులు అభినందించారు.

## బిజెపితో జాతీయ విద్యావిధానానికి ముప్పు

### ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిజెపిని ఓడించకపోతే ప్రభుత్వ విద్యా వ్యవస్థ ధ్వంసం అవుతుందని నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై బిజెపిని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యా విధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. యూనివర్సిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను మరింత కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందన్నారు. ఈ విధానలు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని రామకృష్ణ ఆరోపించారు. కేంద్రీయ విశ్వ విద్యాలయాలలో ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారినే యూనివర్సిటీలు నియమాకాలు చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 10 శాతం కూడా బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా, జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తారని ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపర్చలేదన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యూలర్ పదాలను డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముష్కర్లకు తొత్తుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, హెడ్వార్గ్, వీర సవార్కర్ మొదలగు వారి జీవిత చరిత్రలను పాఠ్యాంశాలలో చేర్చడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బిజెపి ముందుందన్నారు. ఓట్ల కోసం రాముని పేరుతో ఓట్లు అడగటం తప్ప మరొకటి లేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించి ఇండియా కూటమిని సెక్యూలర్ పార్టీలను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రోహిత్, ప్రతాప్, ఆకాష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన పల్లె వెలుగు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రమాదవ శాత్తు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం సారపాక గ్రామ శివారు లో చోటు చేసుకుంది. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న మణుగూరు డిపోకు చెందిన టిఎస్ 28ఏ 2219 నెంబర్ గల ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మోతే గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్ళింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రయాణికులలో 20 మందికి స్వల్ప గాయాలు కాగా సుమారు పది మంది ప్రయాణికులకు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు వెంటనే స్పందించి క్షతగాత్రులను భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న బూర్గంపాడు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## బీర్ల అనిత తండ్రి మృతి

### అంత్యక్రియలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత తండ్రి సుబ్బురు సత్తయ్య అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఆదివారం చందుపట్ల గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై బీర్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు హాజరైన వారిలో భువనగిరి, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామేల్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, క్యామ మల్లేష్, బండ్రు శోభారాణి, చిన్నం శ్రీనివాస్, భువనగిరి, జడ్పిటిసిలు బీరుమల్లయ్య అనురాధ హాజరయ్యారు.

## ఈ ఎన్నికలతోనే దేశభవిష్యత్తు : జూలకంటి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఈ ఎన్నికలతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని లౌకిక వాదాన్ని బలపరిచేందుకు ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం భవిష్యత్తు ఆధారపడి ఉందని, ముఖ్యంగా యువత భవిష్యత్తు ఈ ఎన్నికలతో ముడిపడి ఉందన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పదేండ్లకాలంలో మోదీ ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నకరంగా మార్చిందని, మతం పేరిట ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందాలని చూసిందన్నారు, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిన మోదీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్లపాండు, రాగిరెడ్డి మంగారెడివ్ల, తిరుపతి రామ్మూర్తి, పగిడోజు రామ్మూర్తి, కోటిరెడ్డి, లక్ష్మీ నారాయణ, సోమయ్య, వెంకట్‌రెడ్డి, భాషా పాల్గొన్నారు.



## మద్యం అమ్మకాలపై మరో 12 గంటల నిషేధం పెంపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మద్యం అమ్మకాలపై ప్రస్తుతం ఉన్న నిషేధాజ్ఞలను అదనంగా మరో 12 గంటలు పెంచినట్లు పోలీసు కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గతంలో వైన్‌షాప్‌లు, హోటల్స్, క్లబ్స్ అన్ని రకాల లిక్కర్ షాప్‌లు మూసి వేయటానికి నోటిఫికేషన్ జారి చేశారు. అందులో ఈ నెల 11 సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు మద్యం అమ్మకాలపై నిషేధం విధించారు. అయితే తాజా ఉత్తర్వుల మేరకు 14వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు నిషేధాజ్ఞలు పొడిగించారు.




## మల్లికార్జున ఖర్గే హెలికాప్టర్ తనిఖీ

### తప్పుబట్టిన కాంగ్రెస్



**పాట్నా:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికార, పోలీసులు తనిఖీలు చేశారు. కాగా, ఖర్గే హెలికాప్టర్‌ను తనిఖీ చేయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఇటీవలే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను కూడా కేరళలో ఎన్నికల అధికారులు ఇలాగే తనిఖీలు చేశారని గుర్తు చేసింది. బిజెపి నేతత్వంలోని ఎన్‌డిఎ నేతలను వదిలేస్తూ, విపక్ష పార్టీ నేతలను పోలింగ్ అధికారులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించింది. ఎన్‌డీఏ కూటమిలోని ఆగ్రనేతలు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను కూడా ఇలాగే తనిఖీ చేస్తున్నారా... అంటూ ప్రశ్నించింది. ఈ విషయంపై ఎన్నికల సంఘం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

## తొమ్మిదేళ్లైనా చెరగని సిరా గుర్తు

### మహిళకు తలనొప్పిగా మారిన ఇంక్ మార్క్

**తిరువనంతపురం :** సిరా గుర్తు... ఈ పదం గురించి తెలియని వారు ఉండరు. పోలింగ్ రోజు ఓటరు ఓటేసినట్లు తెలిసేందుకు, అదే ఓటరు మళ్లీ ఓటు వేయకుండా ఈ గుర్తు వేస్తారు. వేలి గోరుతోపాటు చర్మానికి పూసిన ఈ సిరా చుక్క త్వరగా చెరపడానికి వీలుపడదు. 15 నుంచి 30 సెకండ్లలో ఆరిపోతుంది. ఇది కొద్దిరోజులు మాత్రమే మనవేలిపై అలాగే ఉంటుంది. అయితే, ఓ మహిళకు మాత్రం ఏళ్లతరబడి ఆ గుర్తు అలాగే ఉండిపోయింది. ఇప్పుడు ఇది ఆమెకు ఓపెద్ద తలనొప్పిగా మారింది. కేరళకు చెందిన ఉష(62) 2016లో ఓటేసింది. ఆ సందర్భంగా వేలిపై వేసిన సిరా గుర్తు ఎన్నేళ్లైనా చెరిగిపోవడం లేదు. అనేక రకాల సబ్బులు, ద్రావణాలను ఉపయోగించినా లాభం లేదట. ఆ తర్వాత జరిగిన స్థానిక ఎన్నికల్లో ఓటేసేందుకు వెళ్తే వేలిపై గుర్తు చూసి ఓటేసేందుకు ఎన్నికల అధికారులు అనుమతించలేదు. పోలింగ్ బూత్ లో ఏజెంట్లు అసలు విషయం చెప్పడంతో ఓటేసేందుకు అనుమతించారు. 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఉష ఇంకు గుర్తు కారణంగా ఓటేసేందుకే వెళ్లలేదు. దాదాపు తొమ్మిదేళ్లయినా తన ఎడమచేతి చూపుడు వేలికి వేసిన సిరా గుర్తు ఇప్పటికీ చెరిగిపోలేదు. దీంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే ఇబ్బంది తలెత్తుతుందని గ్రహించిన ఉష.. ఈ విషయా న్ని ప్రచారానికి వచ్చిన ఓ నాయకుడి చెప్పింది. అతను ఎన్నికల అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా. వారు ఉషను ఓటేసేందుకు అనుమతించారు. ప్రస్తుతం ఈ వార్త తెగ వైరల్ అవుతోంది.

## విమాన ప్రయాణాల్లో ప్రయాణికుల వింత ప్రవర్తన

**వి**మాన ప్రయాణాల్లో కొందరు ప్రయాణికులు తోటి వారికి, విమాన సిబ్బందికి అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. ఇటీవల కాలంలో నిత్యం ఇలాంటి ఘటనలే ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఓ ప్రయాణికుడు క్రూ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించాడు. కేరళలోని కన్నూర్‌కు చెందిన మహ్మద్ బిసి అనే వ్యక్తి ఈనెల 8న దుబాయ్ నుంచి మంగళూరుకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ప్రయాణించాడు. ప్రయాణ సమయంలో విమానంలో వికృతంగా ప్రవర్తిస్తూ... తోటి ప్రయాణికులకు, క్రూ సిబ్బందికి ఇబ్బందులు సృష్టించాడు. విమానం నుంచి సముద్రంలోకి దూకేస్తా అంటూ సిబ్బందిని బెదిరించాడు. దీంతో భయాందోళకు గురైన సిబ్బంది ఈ విషయాన్ని వెంటనే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక విమానం మంగళూరులో ల్యాండ్ కాగానే అతడిని పోలీసులకు అప్పగించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ సిద్ధార్థ్ దాస్ ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసుకున్నట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అతడిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## జలపాతంలో మునిగి ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

**హైదరాబాద్:** అమెరికాలో తెలుగు విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఇద్దరు తెలుగు విద్యార్థులు జలపాతంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. లక్కిరెడ్డి రాకేశ్‌రెడ్డి (23), రోహిత్ మణికంఠ రేపాల (25) అమెరికాలోని అరిజోనా విశ్వవిద్యాలయంలో చదువుతున్నారు. చదువు విజయవంతంగా పూర్తి చేసి ఇటీవలే ఎంఎస్ పట్టా పొందారు. ఈనెల 8న వీరు తమ స్నేహితులతో కలిసి ఆరిజోనాలోని ఫాజిల్ క్రీక్ జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ రాకేశ్, రోహిత్ ప్రమాదవశాత్తూ జలపాతంలో మునిగిపోయారు. గమనించిన స్నేహితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా వారు జలపాతం వద్ద గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా ఇద్దరి మృతదేహాలు లభించాయి. మృతుల్లో రాకేశ్‌రెడ్డి... ఖమ్మం నగరానికి చెందిన మాంటిస్సోరి, తెలంగాణ నారాయణ పాఠశాలల అధినేతల్లో ఒకరైన లక్కిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పద్మ దంపతుల ఏకైక కుమారుడిగా గుర్తించారు. వీరి మృతదేహాలను భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

## మైనారిటీలు ఎటువైపు?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ రెండూ మైనార్టీ ఓట్లను చీల్చుకుంటే, చివరగా తమకు ఉపయోగమని, తమ ఓటు బ్యాంక్ తమకు ఉంటుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కానీ చివరి సమయంలో బీఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతు ప్రకటించకపోవడం, పైగా పరోక్షంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, బిజెపిని ఓడించాలని అసదుద్దీన్ ప్రకటించడంతో తాజాగా రాజకీయ సమీకరణలు మారే అవకాశాలు ఉంటాయని పలువురు భావిస్తున్నారు. మెజార్టీ, మైనార్టీ ఓట్లు ఒకే పార్టీకి పోలవుతే, గెలుపోటములపై ప్రభావం చూపుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## సూత్రధారుల మాటేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

ఆధారాలు లేవని పేర్కొంది. కాగా, కేసుపై తీర్పును వెల్లడిస్తూ, సిబిఐ, పోలీసుల పనితీరుపై జస్టిస్ జాధవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. షూటర్లకు సాయం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి వ్యతిరేకంగా సాక్ష్యాలు లేవని స్పష్టం చేశారు. అదే విధంగా, దభోల్కర్‌ను హత్య చేసిన ఇద్దరికి జీవిత ఖైదును విధించిన ఆయన, నిజానికి వీరికి మృతుడితో ఎలాంటి సంబంధాలుగానీ, విభేదాలుగానీ లేవని జస్టిస్ జాధవ్ అన్నారు. ప్రధాన సూత్రధారులు ఎవరో వీరిని హత్యకు పురిగొల్పి ఉంటారని వ్యాఖ్యానించారు. అయితే, సూత్రధారులను కనిపెట్టడంలో సిబిఐ, పోలీసు శాఖ విఫలమయ్యాయని, వారు పేర్కొన్న ప్రధాన నిందితుడు డాక్టర్ తావ్డే నేరాన్ని నిరూపించే సరైన సాక్ష్యాధారాలు ఏవీ లేవని ఆయన అన్నారు. ఇలావుంటే, ఈ కేసు విచారణ సమయంలో, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (యుఎపిఎ) కింద కేసుల ప్రత్యేక కోర్టు అదనపు సెషన్స్ జడ్జి జాదవ్ 20 మంది సాక్షులను విచారించారు. తొలుత ఈ కేసును విచారించిన పోలీసులు, బాంబే హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో, 2014లో కేసును సిబిఐకి అప్పగించింది. రెండు దశాబ్దాలు గడిచినా, సరైన సాక్ష్యాలను అందించలేకపోయింది. కాగా, దభోల్కర్ హత్య తర్వాత నాలుగు సంవత్సరాల్లో మరో ముగ్గురు హేతువాదులు, కార్యకర్తల హత్యలు జరిగాయి: కమ్యూనిస్ట్ నాయకుడు గోవింద్ పన్సారే (కొల్హాపూర్, ఫిబ్రవరి 2015), కన్నడ పండితుడు, రచయిత ఎంఎం కల్బుర్గి (ధార్వాడ్, ఆగస్టు 2015), జర్నలిస్టు గౌరీ లంకేశ్ (బెంగళూరు, సెప్టెంబర్ 2017) తదితరులు హత్యకు గురయ్యారు. ఈ నాలుగు కేసుల్లో నిందితులు ఒకరికొకరు సంబంధమున్నట్లు అనుమానిస్తున్నారు. కాగా, పుణే హైకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకాశ్ సూర్యవంశీ తెలిపారు. అయితే, అక్కడ కూడా సాక్ష్యాధారాలను సిబిఐ ఇవ్వగలుగుతుందా? అన్నది అనుమానమే.

**అప్పీల్ చేస్తాం..** నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో కేవలం ఇద్దరికి మాత్రమే శిక్ష పడగా, ముగ్గురు నిర్దోషులుగా విడుదల కావడంపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేస్తామని దబోల్కర్ కుమారుడు హమీద్, సోదరి ముక్తా తెలిపారు. వీరిద్దరూ మీడియాతో మాట్లాడుతూ, ఇద్దరు నేరస్థులకు జీవిత ఖైదు శిక్ష పడడం హర్షదాయకమని, అయితే, సాక్ష్యాలు లేని కారణంగా ముగ్గురు విడుదల కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. తమకు అర్థ న్యాయమే జరిగిందని వ్యాఖ్యానించారు.

**తప్పుడు ప్రచారం చేశారు..** దబోల్కర్ హత్య కేసులో 'సనాతన సంస్థ' హస్తం ఉందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే, ఎక్కడా లేని 'హిందూ ఉగ్రవాదం' సిద్ధాంతాన్ని బలంగా వినిపించేందుకు అప్పటి ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ తప్పుడు ప్రచారం చేశారని సనాతన సంస్థ కార్యవర్గ సభ్యుడు ఘన్వత్, అధికార ప్రతినిధి అభయ్ వర్తాక్ ఆరోపించారు. విచారణ జరుగుతున్న తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దభోల్కర్ కుటుంబ సభ్యులు తమ సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి అన్ని రకాలుగా ప్రయత్నించారని అన్నారు. దభోల్కర్ హత్యతో సనాతన సంస్థకు ఎలాంటి సంబంధం లేదని వారు అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com